జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 4 సంచిక 80 | హైదరాబాద్, జనవరి 08 శుక్రవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

## అమెరికాలో హింసపై మోదీ ఆవేదన



న్యూఢిల్లీ,జనవరి 07, ప్రజాపాలన : అమెరికాలో హింసపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. వాషింగ్టన్ డీసీలో అల్లర్లు, హింస నేపథ్యంలో నలుగురు మరణించారు, ఈ తరుణంలో మోదీ గురువారం ఇచ్చిన ట్వీట్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. "వాషింగ్టన్ డీసీలో అల్లర్లు, హింస గురించి వార్తలు చూడటం ఆవేదన కలిగించింది. పద్ధతి ప్రకారం, శాంతియుత అధికార బదిలీ కొనసాగాలి. చట్ట వ్యతిరేక నిరసనల ద్వారా ప్రజాస్వామిక ప్రక్రియ పక్కదోవపట్టడానికి అనుమతించరాదు" అని మోదీ పేర్కొన్నారు.

**అనూహ్య సంఘటనలో నలుగురి మృతి**

యూఎస్ కేపిటల్‌వైపు అనూహ్యంగా కొందరు దూసుకురావడంతో పెద్ద ఎత్తున హింస జరిగింది. అనేక మంది గాయపడగా, నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచానికి నాయకత్వం వహించే స్థితిలో ఉన్న అమెరికాలో జరుగుతున్న పరిణామాలను ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నేతలు ఖండించారు. ఇదిలావుండగా, అమెరికా తదుపరి అధ్యక్షుడు జో బైడెన్ అని అమెరికన్ కాంగ్రెస్ ధ్రువీకరించింది. దీంతో అమెరికా 46వ అధ్యక్షుడిగా జో బైడెన్ ఈ నెల 20న ప్రమాణ స్వీకారం చేస్తారు. మరోవైపు అధికార బదిలీకి తాను పూర్తిగా సహకరిస్తానని ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

## మంత్రులు, ఎమ్మెల్యేలపై కేసీఆర్‌కు నమ్మకం లేదు:బండి సంజయ్



వరంగల్,జనవరి 07, ప్రజాపాలన : టీఆర్ఎస్ తెలంగాణ ప్రజలను నాశనం చేసే పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. టీఆర్ఎస్, ఎంఐఎం హిందూ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై కేసీఆర్‌కు నమ్మకం లేదన్నారు.బీజేపీ, టీఆర్ఎస్ ఒక్కటేనని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. టీఆర్ఎస్ నాయకుల డ్రామాలను ప్రజలు నమ్మరని చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ విస్మరించారన్నారు. ప్రజలను మభ్యపెడుతున్న కారు పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన కర్మ బీజేపీకి పట్టలేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

## 'బండి'పైకి టిఆర్ఎస్ సరికొత్త అస్త్రాలు.!



వివరాలు 2లో..

## ఘనంగా స్నేహ సంస్థల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



హైదరాబాద్, జనవరి 07, ప్రజాపాలన :బహుజనులకు రాజ్యాధికారం దక్కాలన్న ప్రధాన ఎజెండా తో బహుజనులకు ఒక పత్రిక, బహుజనులకు ఛానల్స్ పెట్టి బహుజన సమస్యలపై పోరాడుతున్న సంస్థ ల తరపున నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరింపజేయడం ఆనందంగా ఉంది అన్నారు స్నేహ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కటికల క్రాంతి కుమార్. స్నేహ సంస్థల ప్రధాన కార్యాలయం హైదరాబాద్ లో ఆయన స్నేహ సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు,మాస్టర్ కీ ఛానల్ డైరెక్టర్ ఆఫ్ కోఆర్డినేషన్ ఆరేపల్లి రాజేందర్,మరో డైరెక్టర్ ,లోక్ జనశక్తి పార్టీ తెలంగాణ రాష్ట్రఅధ్యక్షుడు ఇనుగాల భీమ్ రావ్ లు సంయుక్తంగా నూతన సంవత్సర క్యాలెండర్ ని ఆవిష్కరించారు. **ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ** ఈ నూతన సంవత్సరం బహుజనుల ముఖాలలో ఆనందం వెదజల్లే సంవత్సరం గా నిలవాలని ఆకాక్షించారు. బహుజనుల ఐక్యతకు నిదర్శనమే మన స్నేహ సంస్థలకు వస్తున్న విశేష గుర్తింపుకు తార్కాణం అన్నారు. ప్రజా సమస్యలపై ము ఖ్యంగా బహుజనుల సమస్యలపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజాపాలన పత్రిక, స్నేహ,మాస్టర్ కీ ఛానల్ సిబ్బందికి సూచించారు.

**స్నేహ సంస్థల చైర్మన్ కటికల శివ భాగ్యారావు మాట్లాడుతూ**

బహుజనులకు రాజ్యాధికారం సాధించేంత వరకు ప్రజాపాలన పత్రిక, స్నేహ టివి నిర్విరామంగా కృషి చేస్తాయని తెలిపారు. బహుజన సమస్యలు ప్రధాన ఎజెండా గా ఈ సంస్థలు పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరణ కొరకు ప్రముఖ పాత్ర పోషించిన ప్రజాపాలన పత్రిక రెండు తెలుగు రాష్ట్రాల కో ఆర్డినేటర్ గుంపర్తి భాస్కరరావుని, షెడ్యూలింగ్ ఇంఛార్జి బి.కృష్ణవేణిని మరియు ప్రజా పాలన పత్రికా సిబ్బందిని ఈ క్యాలెండర్ కొరకు పాటుపడిన అందరినీ ఆయన అభినందించారు.

**ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ**

బహుజనుల సమస్యలు చూపడానికే ఇప్పుడున్న మీడియా సంస్థలు వెనుకడుగు వేస్తున్న సమయంలో బహుజనుల కొరకు ఒక పత్రిక, రెండు చానల్స్ ని ఏర్పాటు చేసి బహుజన సమస్యలపై అలుపెరుగకుండా పోరాడుతున్న కటికల శివ భాగ్యారావు గారు ధన్యజీవులు అన్నారు.బహుజనులు అందరూ ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాపాలన పత్రిక సిబ్బంది, స్నేహ టివి సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టు తొలి మహిళా చీఫ్ జస్టిస్‌గా ...
## హిమా కోహ్లీ ప్రమాణ స్వీకారం



హైదరాబాద్, జనవరి 07, ప్రజాపాలన :తెలంగాణ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హిమా కోహ్లి గురువారం మధ్యాహ్నం ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ తమిళిసై ఆమెతో ఈ సందర్భంగా ప్రమాణం చేయించారు. కోహ్లీకి ఈ సందర్భంగా గవర్నర్ తమిళ సై పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూలబొకె ఇచ్చి కోహ్లీకి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఈ కార్యక్రమంలో మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించిన జస్టిస్ హిమా కోహ్లి బదిలీపై తెలంగాణ సీజేగా నియమితులయ్యారు. దేశంలో 78 మంది మహిళలు న్యాయమూర్తులు పనిచేశారు. 1991లో దేశంలో హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ లీలాసేథ్ రికార్డు సృష్టించారు. ఆమె హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా చీఫ్ జస్టిస్‌కు హిమా కోహ్లీ రికార్డు సృష్టించారు. సెప్టెంబరు 2, 1959న ఢిల్లీలో జన్మించిన హిమా కోహ్లీ.. అక్కడే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎంఏ తర్వాత లా చదివారు. 1984లో లా డిగ్రీ పొంది, అదే ఏడాది ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. మిగతా 3లో..

## ఏ1గా భూమా అఖిలప్రియ



హైదరాబాద్, జనవరి 07, ప్రజాపాలన :బోయిన్‌పల్లి కిడ్నాప్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. భూమా అఖిలప్రియ రిమాండ్ రిపోర్టు బయటపడటంతో అనేక ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. హఫీజ్‌పేట్ భూ వివాదంలో సూత్రధారి భూమా అఖిలప్రియ అని పోలీసులు తేల్చారు. అందుకే ఎ-1గా భూమా అఖిలప్రియను పేర్కొన్నారు పోలీసులు. దీంతో అంతకు ముందు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు మార్పులు చేశారు. కొత్త ఎఫ్ఐఆర్‌లో ఎ-1 అఖిలప్రియ, ఎ-2 ఏవీ సుబ్బారెడ్డి, ఎ-3 భార్గవ్‌రామ్ పేర్లను నమోదు చేశారు.

నిందితులుగా శ్రీనివాసరావు, సాయి, చంటి, ప్రకాశ్ పేర్లు నమోదు చేశారు పోలీసులు. కళ్లకు గంతలు కట్టి తీసుకెళ్లినట్లు పోలీసులకు కిడ్నాప్‌కు గురైన బాధితులు పేర్కొన్నారు. హఫీజ్‌పేట సర్వే నెంబర్.80లో 2016లో బాధితులు భూములు కొనుగోలు చేశారు. 25 ఎకరాలను బాధితులు కొనుగోలు చేశారు. భూమి తమదేనని అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి, భార్గవ్‌రామ్ వాదిస్తున్నారు. అయితే ఈ భూమి విషయాన్ని ఏవీ సుబ్బారెడ్డికి ప్రవీణ్‌రావు డబ్బులిచ్చి సెటిల్ చేసుకున్నారని సమాచారం.

హఫీజ్ పేట్ లో ఏవీ సుబ్బారెడ్డి, భూమా నాగిరెడ్డి భూములు కొనుగోలు చేసారని...భూమా నాగిరెడ్డికి అత్యంత సన్నితుడిగా ప్రవీణ్ రావ్ తండ్రి కిషన్ రావ్ ఉన్నాడని పోలీసుల విచారణలో వాస్తవాలు బయటపడ్డాయి. భూమా బతికి ఉన్న సమయంలో... భూమాకి కీలకంగా కిషన్ రావ్ వ్యవహరించాడని... భూమా నాగిరెడ్డి మరణం తర్వాత ల్యాండ్ విషయంలో రంగంలోకి ఏవీ సుబ్బా రెడ్డి దిగాడని పోలీసులు గుర్తించారు. భూమి ధర పెరగడంతో నిందితులు సమస్యలు సృష్టించారని పోలీసులు విచారణలో తేల్చారు. ఇంకా డబ్బులు కావాలని నిందితులు డిమాండ్ చేసినట్లుగా చెప్పారు.



# 'బండి'పైకి టిఆర్ఎస్ సరికొత్త అస్త్రాలు.!

**(కేసీఆర్ ఢిల్లీ వెళ్లొచ్చిన తర్వాత బీజేపీ విషయలో కేసీఆర్ స్వరం మారింది. బిజెపి నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఘాటుగా విమర్శిలు చేసినా గతంలో మాదిరిగా టీఆర్ఎస్ అగ్ర నేతలు బీజేపీ నాయకులను విమర్శించడం లేదు. కానీ దిగువ స్థాయి నేతలు మాత్రం మాటలతో విరుచుకపడుతున్నారు. దింతో దిష్టిబొమ్మ దగ్ధం చేస్తూ , అవినీతి పై సవాళ్ళ విసురుతూ ఆందోళన చెందుతున్నారు బిజెపి కార్యకర్తలు)**

**బిజెపి పై మాటల యుద్ధం ప్రకటించిన టిఆర్ఎస్ నేతలు**

**దీటుగా ఆందోళన కు సిద్ధమైతున్న బిజెపి శ్రేణులు**

**సవాల్లు – ప్రతిసవాల్లతో సోషల్ మీడియాలలో హల్ చల్ చేస్తున్న వీడియోలు**






మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి7, ప్రజాపాలన : దుబ్బాక ఉపఎన్నిక, జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత బీజేపీ జోరు మీదుంది. అధికార టీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరిస్తోంది. నాగార్జునసాగర్ ఉపఎన్నికతోపాటు.. వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల ఎన్నికలపై కమలం పార్టీ గురిపెట్టింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో బీజేపీతో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరించిన కేసీఆర్.. ఢిల్లీ పర్యటన తర్వాత సైలెంటయ్యారు. సాగు చట్టాలకు అనుకూలంగా వ్యవహరించడంతోపాటు.. ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో అమలు చేస్తామని కేంద్రానికి తెలిపారు. కేసీఆర్ ఢిల్లీ టూర్ ముందు వరకూ మంత్రులు, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయిలో జరిగేది. బీజేపీ నేతల మాటలకు టీఆర్ఎస్ మంత్రులు గట్టిగా కౌంటర్ ఇచ్చేవారు. కానీ గులాబీ బాస్ హస్తిన పర్యటన తర్వాత సీన్ మారిందని చెపుకోవచ్చు. బీజేపీ నాయకులను మంత్రులు విమర్శించడం మానేశారు. ఎవరైనా విమర్శిస్తే... వద్దని కేసీఆర్ వారిస్తున్నారని సమాచారం. అనవసరంగా బండి సంజయ్‌ను హీరో చేయొద్దని.. మీ స్థాయికి ఆయనపై విమర్శలు ఏంటని..? మంత్రులతో కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం.స్వయంగా సీఎం వద్దని చెప్పడంతో.. బీజేపీ నేతల విషయంలో మంత్రులు ఆచితూచి మాట్లాడుతున్నారు. కానీ బీజేపీ నేతల వైపు నుంచి మాటల దాడి ఆగకపోవడంతో.. టీఆర్ఎస్ అధినేత వ్యూహం మార్చారు. మంత్రులను సైలెంట్‌గా ఉండమని చెబుతూనే.. అంత కంటే దిగువ స్థాయి నేతలతో ఎదురు దాడి చేయిస్తున్నారు.ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, విప్ బాల్కా సుమన్ తదితరులు బండి సంజయ్‌ను టార్గెట్‌గా చేసుకొని మాటల తూటాలు పేలుస్తున్నారు. సంయమనం పాటిస్తున్నా మంటూనే..దీటుగా, పరుష పదజాలంతో విరుచుకు పడుతున్నారు. బీజేపీ నేతలు తమను విమర్శించినా.. ఘాటుగా బదులిచ్చే పరిస్థితి లేనందుకు ఇబ్బంది పడుతున్న మంత్రులు.. బాల్కా సుమన్ లాంటి నేతల విమర్శలతో సంతృప్తి పడుతున్నారు. డిల్లీలో దోస్తీ – రాష్ట్రంలో కుస్తీ పరేషాన్ ఐతున్న పబ్లిక్

ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహం ఏంటో అంతేలిగ్గా అధికారపార్టీ నేతలకు సైతం అర్థం కాదు. వ్యూహ రచనలో దిట్ట , మాటల మాంత్రికుడు ఎంతటి వ్యతిరేక తనైనా తన మాటల చాతుర్యం తో జేజేలు కొట్టించుకునే గొప్ప నేత.ఐతే కేసీఆర్ డిల్లీ పర్యటన తర్వాత సైలెంట్ ఐన తీరు అంతు చిక్కడంలేదు. కేసీఆర్ ను జైల్లో పెడతాం అంటూ బిజెపి ఘాటుగా విమర్శించినా తేలిగ్గా తీసుకుని అంతకు ముందు వ్యతిరేకించిన సాగు చట్టాలకు అనుకూలంగా వ్యవహరించడంతోపాటు.. ఆయుష్మాన్ భారత్‌ను రాష్ట్రంలో అమలు చేస్తామని కేంద్రానికి తెలిపారు. కేసీఆర్ అవినీతి చేశారు కాబట్టే బిజెపి కి బయపడుతున్నారని బిజేపీ క్రిందిస్థాయి నాయకులు విమర్శలు చేస్తున్నా ప్రజలు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అవినీతికి పాల్పడిన కేసీఆర్ పై మోదీ ప్రభుత్వం ఎందుకు కాపాడుతుందని ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా బిజెపి వర్సెస్ టిఆర్ఎస్ మాటల యుద్ధం వ్యక్తి గత విమర్శలతో హోరెత్తిపోతుంది. ఐతే ఇరు పార్టీలు రాజకీయాలను భ్రస్టుపట్టి స్తున్నారని, ఇవి ప్రజల బతుకులు మార్చేందుకు పనికి రావని ప్రజలు అనుకుంటున్నారు.

# కేసీఆర్ ది పలాయన వాదం



## ఢిల్లీ వెళ్లి వచ్చాక కేసీఆర్ యూటర్న్

## మోదీ చట్టాల వల్ల మొత్తం సమాజానికే నష్టం

## కార్పొరేట్ వ్యవస్థల చేతుల్లోకి ఆర్థిక వ్యవస్థ

## సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

మధిర, జనవరి 07, ప్రజాపాలన :%రైతుల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పలాయన వాదం పఠించారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లు మండిపడ్డారు. భారత్ బంద్ సమయంలో రైతులకు బద్దతు పలికి ఢిల్లి వెళ్లి యూ టర్న్ తీసుకున్నారని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పై తీవ్ర విమర్శలతో భట్టి విక్రమార్క విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు నిరసగా ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా ఈ నెల 9న ఇందిరా పార్క్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకూ ధర్నా చేస్తున్నట్లు భట్టి తెలిపారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ శాసనసభా పక్షం మొత్తం పాల్గొంటుందని ఆయన ప్రకటించారు. రైతులు ఇంత చలిలో 43 రోజులుగా దీక్ష చేస్తుంటే.. బాధ్యత కలిగిన ప్రధాని, వ్యవసాయ శాఖా మంత్రి కానీ వారి దగ్గరకు వెళ్లి కనీసం మాట్లాడకపోవడం అత్యంత దురదృష్టకరమని భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని ఒక రోజు భారత్ బంద్ లో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వం.. తరువాత కేసీఆర్ ఢిల్లీ వెళ్లాక యూ టర్న్ తీసుకున్నారని బట్టి దుయ్యబట్టారు. ఢిల్లీ వెళ్లిన కేసీఆర్ అక్కడకు దగ్గరలోనే ధర్నా చేస్తున్న రైతులను కలవకపోవడం ఆయన నైజాన్ని బయట పెట్టిందన్నారు. కేంద్రం ప్రవేశ పెట్టిన బిల్లులకు వ్యతిరేకంగా మాట్లాడిన కేసీఆర్ హైదరాబాద్ వచ్చాక.. పూర్తిగా యూటర్న్ తీసుకుని రైతు వ్యతిరేక నిర్ణయాలను ప్రెస్ మీట్ పెట్టి మరీ కేసీఆర్ వెల్లడించడం అత్యతం హాస్యాస్పదం అన్నారు. రైతులు పండించిన పంట కొనడం వల్ల ప్రభుత్వానికి రూ.7,500 కోట్లు నష్టం వస్తోందని ఒక బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి చెబుతాడా?? అంటూ భట్టి ఆగ్రహంగా ప్రశ్నించారు. పంట కొనడం వల్ల లాస్ వస్తోంది.. ఇక కొనం.. రైతులే తమ పంటను అమ్ముకోవాలనడం.. ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి కేసీఆర్ పలాయన వాదం పఠించేలా ఉన్నాయని భట్టి విక్రమార్క అన్నారు. ఇక బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి ఎవరూ ఇటువంటి మాటలు మాట్లాడరని అన్నారు. ప్రభుత్వం పంటను కొనడం మానేస్తే రేపటి నుంచే రాష్ట్రంలోని దళారులు మద్దతు ధర కంటే తక్కువగా రైతుల వద్ద పంటను కొనేందుకు, రైతులను పీడించేందుకు పథక రచన చేస్తారని అన్నారు. ఇది కేవలం రైస్ మిల్లర్లతో ముఖ్యమంత్రి కుమ్మక్కై దళారులకు మేలు చేసేందకే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజల కోసం చేసే పనులను ప్రభుత్వం ఎప్పుడూ లాభాపేక్షతో చూడరాదని భట్టి విక్రమార్క చెప్పారు. భారత రాజ్యాంగం ప్రకారం మనది శ్రేయోరాజ్యమని అన్నారు. నడిచే ప్రభుత్వాలన్నీ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తాయని చెప్పారు. ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చే జీతాలు, ప్రజల కోసం ఇచ్చే సంక్షేమ పథకాల వల్ల ప్రభుత్వానికి నష్టం వస్తోందని చెప్పడం మూర?త్వమని అన్నారు. పాలన ఉన్నదే ప్రజల కోసం అని భట్టి చెప్పారు. రాష్ట్రం అంటే కార్పొరేట్ సంస్థ కాదు.. దీనికి కేసీఆర్ సీఈఓ కాదని భట్టి అన్నారు. దుర్మార్గపు ఆలోచనలను కేసీఆర్ దూరం పెట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో పండిన ప్రతి పంటను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. మద్దతు ధరకన్నా ఒక్క రూపాయి తగ్గినా ఈ సమాజం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతుల వ్యతిరేక చట్టాలను విరమించుకునే వరకూ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టాల వల్ల రైతుకు మాత్రమే నష్టం వస్తుందంటే పొరపాటని.. మొత్తం సమాజానికే నష్టమని భట్టి వివరించారు. మోదీ తెచ్చిన కొత్త చట్టాలు కార్పొరేట్ వ్యవస్థలకు మేలు చేస్తాయని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను కార్పొరేట్ వ్యవస్థలు గుప్పిట్లో పెట్టుకునే అవకశాన్ని ఈ చట్టాలు కల్పిస్తాయనే ఆందోళనను భట్టి వ్యక్తం చేశారు.

## బిసి కులాలకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**మహాజన సోషలిస్టు జిల్లా కన్వీనర్ పూల బోయిన మొండయ్యా**

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి07(ప్రజాపాలన): తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలకు చెందిన ప్రజలకు టిఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఎం ఎస్ పి జిల్లా కన్వీనర్, కో కన్వీనర్ లు, పూల బోయిన మొండయ్య, లోబడే లహు కుమార్ లు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రములోని బిసి కులాలకు చెందిన నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బీసీ కులాలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం లేదని, రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు జనాభాకు సరిపడా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతీ, యువకులకు, ప్రభుత్వం వెంటనే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. పేద విద్యార్థుల కోసం జిల్లా కేంద్రంలో బిసి స్టడీ సర్కిల్ ను మంజూరు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ రేగుంట మహేష్, ఎం ఎస్ పి, వాంకిడి మండల అధ్యక్షుడు సుభాష్, నాయకులు నవీన్, సాగర్, రమేష్, పోచన్న, హనుమంతులు, తదితరులు పాల్గొన్నారు.



## ఏళ్లనాటి సమస్యను పూర్తి చేస్తా:ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జోన్ మార్పుపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన 7వ వార్డ్ ప్రజలు**




జగిత్యాల, జనవరి 07 (ప్రజాపాలన): జగిత్యాల పట్టణంలోని 7వ వార్డ్ కు చెందిన స్థానిక వాసులు తమ నివాస గృహాలు జగిత్యాల ఏరియా ఆసుపత్రి జోన్ లో ఉండడం వల్ల తమకు పర్మిషన్ బ్యాంకులోన్ రాక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని ఏరియా ఆసుపత్రి జోన్ నుండి రెసిడెన్షియల్ గా మార్చాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 7వ వార్డ్ కౌన్సిలర్ వల్లెపు రేణుకమోగిలి ఆధ్వర్యంలో వార్డ్ ప్రజలు డా. సంజయ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జోన్ మార్చే విషయంపై ఏండ్ల నాటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని 7వ వార్డు భాగ్యనగర్ వాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కొత్త బస్టాండ్ కు సమీప దూరంలో ఉన్న భాగ్యనగర్ కాలనీ వాసుల గృహనిర్మాణానికి ఏర్పడుతున్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేస్తానని అన్నారు. భాగ్యనగర్ కు చెందిన 143,144,145,336 సర్వే నంబర్లకు చెందిన 11 ఎకరాల ప్రాంతాన్ని టౌన్ ప్లానింగ్ లో భాగంగా ఏరియా ఆస్పత్రి జోన్ గా పరిగణించడంతో గృహ నిర్మాణ అనుమతులు రావట్లేదని స్థానిక కౌన్సిలర్ వల్లెపు రేణుక మొగిలితో కలిసి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించటంపై హర్షం వ్యక్తం చేశారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



పాలేరు కూసుమంచి జనవరి 7 ప్రజా పాలన : ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కూసుమంచి లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 60 మంది లబ్దిదారులకు రూ. 19,47,000/- విలువగల సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణి చేసిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి దానవాయిగూడెం కి చెందిన 6 గురి లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి చెక్కు లాను అందజేసిన ఎమ్మెల్యే కంథాల ఉపేందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో రూరల్ ఏ సెల్ అధ్యక్షులు బట్టపోతుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో మరణించిన కుటుంబానికి 5 లక్షల ప్రభుత్వ సహాయం



జగిత్యాల, జనవరి 07 (ప్రజాపాలన): జగిత్యాల పట్టణంలోని 4 వ వార్డుకు చెందిన మహమ్మద్ సమీర్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మరణించగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ నుండి మంజూరైన 5 లక్షల రూపాయలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ 50 వేల నగదును 4లక్షల యాభై వేల ఫిక్స్ డ్ డిపాజిట్లను కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని 24 గంటలు నిర్విరామంగా విద్యుత్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. విద్యుత్ షాక్ తో మూగజీవాలు మరణిస్తే ఒక్క గేదెకు 40 వేల చొప్పున అందించి కుటుంబాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి స్థానిక కౌన్సిలర్ క్యాదాసు నవీన్ నాగయ్య రాగుల పరశురాం గౌడ్ ఆనంద్ రావు ఏడి జవహర్ నాయక్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

## టిఎస్ఐఐసి చైర్మన్ బాలమల్లుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 07 ( ప్రజాపాలన ) : టిఎస్ఐఐసి చైర్మన్ బాలమల్లును వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కలిసి 2021నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాదులోని అతని స్వగృహంలో కలిసి మొకాక అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## వాస్తవిక పరిస్థితులపై ప్రజలు జాగురూకతతో మెలగాలి:సెక్యులర్ వాతావరణాన్ని ధ్వంసం చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పన్నాగాన్ని ఎండగట్టండి

**డాక్టరు యం . సురేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా సైన్సు వేదిక**

రాష్ట్రంలో హిందూ దేవాలయాలలోని విగ్రహాలపై కొంత కాలంగా జరుగుతున్న దాడులు, విధ్వంసం ఒక పథకం ప్రకారం మత సామరస్యాన్ని, ప్రజాస్వామ్య, సెక్యులర్ వాతావరణాన్ని విధ్వంసం చేసి, సంకుచిత రాజకీయ ప్రయోజనాన్ని పొందడం కోసం మతోన్మాద శక్తులు చేస్తున్న నీచ ప్రయత్నం తప్ప వేరేమీ కాదు. ప్రజలను వాస్తవిక పరిస్థితుల నుండి దూరం చేసి, అనవసర విషయాలపట్ల ప్రాముఖ్యత సంతరించుకోవడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనడానికి సంకేతం. దేశ రాజధానిలో గత రెండు నెలలుగా రైతులు చేస్తున్న పోరాటాలను ప్రక్కదోవ పట్టించి, వారి ఐక్యతను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నిత్యావసర సరకుల ధరలను పెంచి, గ్యాసు , పెట్రోలు డీజిల్ ధరలను అర్థం పర్థం లేకుండా పెరుగుతూ పోతున్నాయి. ఇన్పుట్ సబ్సిడీ లేదు , క్రాప్ లాస్ లేదు, రైతు భరోసా ఊసే లేదు. దేశంలో అతిపెద్ద రవాణా రైల్వే తొమ్మిది నెలలు గడుస్తున్న పట్టాలెక్కలేదు.బ్యాంకులను విలీనం చేసి, నోట్లరద్దు , జీఎస్టీ, బి ఎస్ ఎన్ ఎల్, ఎల్ ఐ సి లాంటి సంస్థలను నిర్వీర్యం చేసి ఎన్నో ప్రజాకంటక నిర్ణయాలు తీసుకున్న కేంద్ర ప్రభుత్వం. అలాగే నేనేమి తక్కువ కాదు అని ఆస్తి పన్ను పెంచి, అర్థం పర్థం లేని ఫిక్సడ్ రోడ్ సర్చార్జి, రైతు సంక్షేమం రైతు భరోసా కేంద్రాల ద్వారానే అని రైతులను నిండా ముంచింది. మరోవైపు పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి పెట్టిన విద్యాదీవెన పథకాన్ని ఉపసంహరించుకొని విద్యార్థులను చదువుకు దూరంచేసింది. హో రాష్ట్రంలో దళితుల పై అగ్రవర్ణ దాడులు, లైంగిక దాడులు, హత్యలు, పరువు హత్యలు ఇన్ని జరుగుతున్న వీటిపై చర్యలకు ఉపక్రమించక, అనవసర చిల్లర గలాటలను ప్రాముఖ్యత నిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నాయి. ఈ కుట్రలను ప్రజా సైన్సు వేదిక తీవ్రంగా ఖండిస్తోంది. ఈ విషయంలో వై.సి.పి. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగానూ, ప్రతిపక్ష టీడీపీ, బిజేపీ, జనసేన పార్టీల సంకుచిత వైఖరితో చేస్తున్న ప్రకటనలు, వ్యవహరిస్తున్న తీరు రాష్ట్రంలో ప్రజల ఐక్యతను, మత సామరస్యాన్ని భంగం కలిగించే విధంగా ఉంది. ఈ దుష్ట ప్రయత్నాలన్నీ వాస్తవ సమస్యలనుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న కుట్రలివి. ముఖ్యంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నేడు దేశంలో జరుగుతున్న రైతుల మహోద్యమం నేపథ్యంలో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరుగుతోంది. ఈ దుష్ట శక్తుల పన్నాగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఐక్యతను కంటికి రెప్పలా కాపాడుకోవాలని ప్రజలను కోరుతున్నాము. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ దుష్ట శక్తులను తక్షణమే బట్టబయలు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజా సైన్సు వేదిక డిమాండ్ చేస్తోంది

## ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా పూర్తి చేయాలి

**ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులు, సాంఘిక సంక్షేమ శాఖ కమీషనర్ యోగితా రాణి ఐ.ఎ.ఎస్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జనవరి 7, ప్రజాపాలన : 2020-21 ఎస్.ఎస్.ఆర్. ఎలక్టోరల్ చాలా స్పష్టంగా ఉండాలని, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా బూత్ స్థాయి అధికారులు పకడ్బందీగా తయారు చేయాలని ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులు, సాంఘిక సంక్షేమ శాఖ కమీషనర్ యోగితా రాణి ఐ.ఎ.ఎస్. అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ భారతి హోళ్ళి కేరితో కలిసి జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎన్నికల అధికారులతో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.ఆర్. కార్యక్రమంలో అనర్హులను వెంటనే జాబితా నుండి తొలగించాలని, ఓటరు జాబితా తయారీలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని, బూత్ స్థాయి అధికారులు వర్కింగ్ కాపీలు చాలా జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో మృతి చెందిన వారు, ఊరు, చిరునామా మార్చిన వారి వివరాలు తొలగించాలని, ఏదైనా ఫిర్యాదు అందినట్లయితే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఫారం 6, 7, 8ఎ దరఖాస్తులు వస్తే వెంటనే పరిశీలించాలని, జనవరి 1, 2021 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో పేరు నమోదు చేయాలని తెలిపారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్ల పనితీరును పరిశీలించడంతో పాటు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఓటరు వివరాల నమోదు, ఇతరత్రా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు రమేష్, శ్యామలాదేవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగము అధికారులు శ్రీనివాస్, రజని, జిల్లాలోని తహశిల్దార్లు, ఉప తహశీల్దార్లు, బూత్ స్థాయి అధికారులు డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారపాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా నామినేషన్ డిపాజిట్ ఫీజు ఇవ్వాలి

**స్వతంత్ర అభ్యర్థి, దివ్యాంగుడు కావలి నర్సిములు**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 07 ( ప్రజాపాలన ): వికారాబాద్ నియోజక వర్గం ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి ఎస్సీ అభ్యర్థిగా నామినేషన్ ఫీజుగా 5,000 రూపాయలు డిపాజిట్ చెశానని స్వతంత్ర అభ్యర్థి, దివ్యాంగుడు కావలి నర్సిములు తెలిపారు. గురువారం ఆయన ప్రజాపాలన ప్రతినిధి తో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని బంట్వారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన కావలి అనంతయ్య కుమారుడు కావలి నర్సిములు ఎమ్మెల్యే గా పోటీ చేయుడానికి వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైందని వివరించాడు.గత 2సంవత్సరాల క్రితం అసెంబ్లీ ఎలక్షన్స్ లో, ఇండిపెండెంట్ అభ్యర్థిగా, భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షునిగా, దివ్యాంగుల సంఘం నుండి, ఎమ్మెల్యేగా నామినేషన్ వేశాడని చెప్పాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు డిపాజిట్ డబ్బులు నాకు వెనక్కి ఇవ్వలేదని తెలిపాడు. వికారాబాద్ ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగినా ఏ అధికారి కూడా సరిగ్గా స్పందించడం లేదన్నాడు. ఇంతకు ముందు వికారాబాద్ డిప్యూటీ తహసీల్దార్ గా కృష్ణకు నా డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వమని ఫామ్స్ నింపి డీటెయిల్స్ నింపి ఇవ్వడం జరిగిందని వివరించాడు. తదనంతరం కృష్ణ నవాబుపేటకు బదిలీపై వెళ్లారు. తరువాత అయన స్థానంలో ధారూర్ నుండి యాదయ్య డిప్యూటీ తహసీల్దార్ గా రావడం జరిగిందన్నాడు. అయన వచ్చిన తరువాత కూడా ఫామ్స్ నింపి ఇవ్వడం జరిగిందన్నాడు. వికారాబాద్ ఎంఆర్ఓ కార్యాలయానికి వెళ్ళి అడిగినప్పుడల్లా ఏదో ఒక కారణం చెప్పడమే కాకుండా అసహనం వ్యక్తం చేస్తున్నాడని అన్నాడు. అధికారులు స్పందించి బాధితునికి సత్వర న్యాయం చేయాలని కోరుతున్నాడు.డిప్యూటి ఎంఆర్ఒ వివరణ కోరగా..ఎస్టీఒ కార్యాలయంలో కావలి నర్సిములు కు సంబంధించిన చలాన్ దొరకడం లేదని అన్నారు. సంబంధిత కార్యాలయాలలో వెతికి వారం రోజులలో బాధితుని సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటి ఎంఆర్ఒ యాదయ్య తెలిపారు.

## తెలంగాణ హైకోర్టు తొలి మహిళా చీఫ్ జస్టీస్‌గా ...

# హిమా కోహ్లీ ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)



1999 - 2004 మధ్య ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌కు న్యాయ సలహాదారుగా పనిచేశారు. ఢిల్లీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యురాలిగా కూడా హిమా కోహ్లీ పనిచేశారు. ఆ తర్వాత ఆమె మే 29, 2006న ఢిల్లీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆగస్టు 29, 2007న పూర్తిస్థాయి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. మే 20, 2019 నుంచి ఢిల్లీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా, జూన్ 30, 2020 నుంచి నేషనల్ లా యూనివర్సిటీ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## అర్బన్ సిఐ ప్రేమయ్యకు ఘన ఆత్మీయ వీడ్కోలు





**పొన్నూరు, ప్రజాపాలన :** పొన్నూరు అర్బన్ సిఐ ప్రేమయ్య కు పట్టన వాసులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. బుధవారం రాత్రి పొన్నూరు లయన్స్ క్లబ్ లో జరిగిన సిఐ ప్రేమయ్య బదిలీపై వెళుతున్న సందర్భంగా ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమం లో రాజకీయ ,వ్యాపార ,ఉద్యోగ ,మీడియా ఆటో వర్కర్స్ తో పాటు పలు సేవా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు ,దళిత సంఘాల నాయకులు ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏమిటో చూపిన పోలీస్ అధికారి ప్రేమయ్య అని పేర్కొన్నారు. కరోన లాక్ డౌన్ సమయంలో కంటెయిన్మెంట్ జోన్లు ఏర్పాటు చేసి కరోన కట్టడికి పాటు బడ్డారని తెలిపారు. రాత్రి పగలు తేడా లేకుండా సిబ్బందిని సమన్వయం చేసుకొని విధులు నిర్వహించిన ప్రేమయ్య సేవలు వెల కట్టలేమని అన్నారు. చిరునవ్వుతో నే కఠిన తరమైన కేసులు ఛేదించి పొన్నూరులో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయడంలో ముందు వరుసలో ప్రేమయ్య ఉన్నారన్నారు. ప్రజల సహకారంతో ఎటువంటి ఇబ్బందులు కలగ కుండా ఆయా శాఖల తో సమన్వయం చేసుకొని విధులను విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. పోలీస్ ఫ్రెండ్లీకి చిరునామాగా మారి కేసులు పెట్టుకున్న ఇరువర్గాల వారితో మాట్లాడి ఎన్నో రాజీలు చేసిన ఉత్తమ పోలీస్ అధికారి ప్రేమయ్య అని కీర్తించారు. ఆయన ఎక్కడ ఉన్నా పొన్నూరు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతారని చెప్పారు. సిఐ ప్రేమయ్య మాట్లాడుతూ పొన్నూరు పట్టణ సిఐ గా పదోన్నతి పొంది వచ్చేటప్పుడు కొత్త బాధ్యతను ఛాలెంజ్ గా తీసుకొని పని చేశానని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంతరణ కోసం ప్రణాళిక బద్దంగా పని చేశామని చెప్పారు. ఈ లోపే కరోన లాక్ డౌన్ వచ్చిందన్నారు. ప్రజల ,మీడియా ,నాయకుల ,ఆయా వర్గాల సహకారంతో కరోనలో పని చేశామని అన్నారు. సిబ్బంది సహకారం గొప్పదని చెప్పారు. పొన్నూరు లో పని చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నానన్నారు. అలాగే ప్రజలు చూపిన ప్రేమాభిమానాల పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఎక్కడ ఉన్నా పొన్నూరు తో అనుబంధం ఎప్పుడు గుర్తుకు వస్తుందని తెలిపారు. అనంతరం ఆయా రంగాల వారు సిఐ ప్రేమయ్య కుటుంబ సభ్యులను దూష్యాలువా లు ,పూల మాలలు ,ఫ్లవర్ బొకేలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వడ్రాన్నం ప్రసాద్ ,బోనిగల వేణు ప్రసాద్ ,ఆకుల వెంకటేశ్వరరావు ,నాజర్ ,అంకినీడు చౌదరి ,కోట శ్రీనివాసరావు ,టౌన్ సిఐ శరత్ బాబు, ఎస్సై హాషీమ్ ,ప్రసాద్, పాల్గొన్నారు.


మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)

జై భీం,

మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?

అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,

Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004

E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

# ప్రజాపాలన

సంపాదకీయం

**శుక్రవారం 8 జనవరి 2021**


## భావజాల వ్యూహంతోనే ప్రజాసంఘాలపై దాడులు!

ప్రజా జీవితంలో మానవీయ విలువల కోసం, ప్రజాస్వామిక చైతన్యం కోసం, రాజ్యాంగబద్ధ హక్కుల కోసం ఆలోచిస్తున్న వాళ్లందరూ తమకు ఆటంకంగా తయారయ్యారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. వీళ్ల మాటలు, రాతలు, పనులు న్యూసెన్స్ అనుకుంటున్నాయి. లౌకిక, ప్రగతిశీల, విప్లవ భావజాలాన్ని తుడిచిపెట్టడంలో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల పరంపర కొనసాగుతోంది. ఇది ప్రజా సంఘాల మీద దాడి అని విడిగా చూడ్డానికి లేదు. మొత్తంగా లౌకిక, ప్రజాస్వామిక విలువల మీద దాడిగా భావించాలి.

ఆలోచనల బలం అందరికన్నా అధికారంలో ఉన్న వాళ్లకే బాగా తెలుసు. అందుకే భిన్నంగా ఆలోచించేవాళ్ల మీద నిఘా వేస్తారు. ఆలోచించకుండా చేయలేరు కాబట్టి ప్రజల్లో లేకుండా చేస్తారు. అక్రమ కేసులు పెట్టి కటక టాల వెనుక్కి తోసేస్తారు. ఆలోచనలు భౌతిక రూపం ధరిస్తాయనే ఆందోళనే దీనికి కారణం. ఈ విషయంలో రాజరికా లకు, ఉదారవాద 'ప్రజస్వామ్యాల'కు తేడా లేదు. బుధవారం విజయవాడలో కుల నిర్మూలనా పోరాట సమితి అధ్యక్షు డు దుడ్డు ప్రభాకర్ అరెస్టు దీనికి ఉదా హరణ. ఆయన ప్రభావశీలమైన ఆలోచ నాపరుడు. నిత్యం దళితుల, పేదల మధ్య పని చేస్తుంటాడు. ముప్పై ఏళ్లుగా దళిత విముక్తి పోరాటాల్లోని అనేక సంఘర్షణల మధ్య నుంచి రాటుదేలాడు. ముఖ్యంగా రాజ్యాంగవాదానికి గురి కాని కుల నిర్మూలనా నాయకుడు. ఆయన అరెస్టు అనేక విషయాలను సూచిస్తున్నాయి. బహుజన, ప్రజాస్వామిక ఉద్యమకారులు వాటిని గమనించాలి.

నిజానికి ఆంధ్రప్రదేశ్‌లో గత నెలన్నరగా ప్రజా సంఘాల నాయకుల అరెస్టుల పరంపర కొనసాగుతోంది. ప్రభాకర్‌తో ఈ సంఖ్య పదికి చేరింది. 2020 నవంబర్ 27న చైతన్యమహిళా సంఘం నాయకురాలు రాజేశ్వరి, అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు అంజమ్మతో ఈ అరెస్టులు మొదలయ్యాయి. డిసెంబర్ 8న మదనపల్లిలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య సభ్యుడు ఆంజనేయులునుబీ డిసెంబర్ 12న, 15న అదే సంఘం నాయకులు కొండారెడ్డిని, అన్నపూర్ణను అరెస్టు చేశారు. డిసెంబర్ 21న, 23న ప్రజాకళామండలి నాయకులు విజయ్, కోటి అరెస్ట య్యారు. 2న న్యాయశాస్త్ర విద్యార్థి క్రాంతిని గుంటూరులో అరెస్టు చేశారు. 26న విరసం సభ్యుడు, అన్నపూర్ణ సహచరుడు డి. శ్రీనివాసరావును విశాఖలో పట్టుకపోయారు.

ఈ సంఖ్య ఇక్కడితో ఆగేది కాదని తెలుస్తోంది. రాష్ట్రంలో 32మంది ప్రజాసంఘాల సభ్యుల మీద నవంబర్ 23న విశాఖపట్నం జిల్లా ముంచింగ పుట్టులో, నవంబర్ 24న గుంటూరు జిల్లా పిడుగురాళ్ల స్టేషన్‌లో రెండు కేసులు పెట్టారు. ఉపాతోపాటు అనేక సెక్షన్ల కేసులు నమోదు చేశారు. కొందరి మీద ఏనాటివో పాత కేసులు బైటికి తీసి చూపించారు. 2005లో అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ లడ్వా మీద మావోయిస్టులు చేసిన హత్యాయత్నం కేసులో డి. శ్రీనివాసరావును అప్పట్లోనే అక్రమంగా ఇరికించారు. ఇప్పుడు ఆ కేసును బైటికి లాగి ఆయన్ను అరెస్టు చేస్తున్నామని చెప్పారు. రాజేశ్వరిని, అంజమ్మను కూడా విశాఖ జిల్లాలోని జి. మాడుగులలో 2018లో పెట్టిన కేసు కింద అరెస్టు చేస్తున్నట్లు చూపించారు.

ఇట్లా నిరాధారమైన కేసులు పెట్టడం, పాత అక్రమ కేసులను బైటికి తీయడం, నెల రోజుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేయడం.. యాదృచ్ఛికం కాదు. వైసీపీ ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే ఈ నిర్బంధాన్ని అమల్లోకి తెస్తోంది. ఈ వ్యవహారమంతా జగన్‌మోహన్‌రెడ్డి పాలనా విధానం. నిజానికి మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ఏ రాష్ట్రంలో అక్కడ పోలీసులు చట్ట ఉల్లంఘనకు పాల్పడినా అది కేవలం ఆ రాష్ట్ర ప్రభుత్వ విధానమే అనుకోడానికి లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్న చర్యలివి. కేంద్రంతో, రాష్ట్ర ప్రభుత్వాలకు పేచీలు ఉన్నా, ఉన్నట్లు బైటికి నటిస్తున్నా.. ప్రజా పోరాటాలు, ఆకాంక్షల విషయంలో మాత్రం అందరిదీ ఒకే వైఖరి. నిస్సందేహంగా ఇది కొన్ని రాజకీయ విశ్వాసాల మీద దాడి. అందుకే దళితుల విముక్తి కోసం పోరాడుతున్న వాళ్లపై అక్రమ కేసుల్ని బనాయించారు. స్త్రీల స్వేచ్ఛ కోసం పరితపిస్తున్న వాళ్లను నేరస్థులను చేశారు. కార్మికులపై దోపిడీని ప్రశ్నిస్తున్న వాళ్లను ప్రమాదకారులుగా చిత్రించి కటకటాలపాలు చేస్తున్నారు. అమరుల త్యాగాలను ఎత్తిపట్టడాన్నే భరించలేకపోతున్నారు. జీవితంలోంచి వేరు చేయలేని సాహిత్య సృజనను విధ్వంస చర్యగా భావించి కేసులు పెడుతున్నారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడే పోరాటం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ దక్షిణాదిన విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. దీనికి తగిన రాజకీయాలను నడుపుతోంది. ఇందులో భావజాల వ్యూహం కూడా ఉంది. విప్లవ, ప్రజాస్వామిక, లౌకిక విలువల గురించి మాట్లాడే వ్యక్తులను, సంస్థలను దెబ్బతీయడంలో భాగంగానే ప్రస్తుత అరెస్టులను చూడాలి.

కాషాయీకరణ, కార్పొరేటీకరణలకు అడ్డంగా ఉండే ఎవరినీ బీజేపీ ప్రభుత్వం బతకనివ్వదల్చుకోలేదు. ఈ విషయంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు పేచీ ఎందుకు ఉంటుంది?

ఈ అరెస్టులను మరో రెండు విషయాలతో కలిపి చూడాలి. ఆంధ్ర–ఒడిషా సరిహద్దు ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్రమవుతున్న నిర్బంధానికి కొనసాగింపే ప్రజాసంఘాల కార్యకర్తలపై అక్రమ కేసులు, అరెస్టులు. గత టీడీపీ ప్రభుత్వం ఆ ప్రాంతంలో కేంద్రం మార్గదర్శకత్వంలో అమలు చేసిన నిర్బంధాన్ని జగన్‌మోహన్‌రెడ్డి మరింత ముందుకు తీసికెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ ఇటీవల రెండు మూడు దారుణ ఘటనలు జరిగాయి. డిసెంబర్ 2న నక్కమామిడి పంచాయతీలోని సంగవరం గ్రామాన్ని అర్ధరాత్రి వందలాది పోలీసులు చుట్టుముట్టి విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు చనిపోయారు. ఆదివాసీ తెగకు చెందిన మావోయిస్టు మల్లాల్ అనే వ్యక్తి, శాంత అనే సాధారణ ఆదివాసీ మహిళ, ఒక చిన్న పాప కూడా ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతంలో ఆంధ్ర, ఒడిషా రాష్ట్రాల వేలాది పోలీలు, సైనిక బలగాలు నిత్యం కూంబింగ్ చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామాలను చుట్టుముట్టి కాల్పులు జరుపుతున్నారు. నవంబర్ 26న తోటగూడ వద్ద కాల్పులు జరిపి కిషోర్ అనే వ్యక్తిని చంపేశారు.

గాయపడిన లైకోన్ అనే వ్యక్తిని పట్టుకొని చిత్రహింసలు పెట్టి అరెస్టు చేశారు. ఇట్లా నిత్యం ఎందరినో అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. ఆదివాసుల సాధారణ జీవితాన్ని కూడా అల్లకల్లోలం చేస్తున్నారు.

ఈ మొత్తానికి నేపథ్యంలో ఒక ముఖ్యమైన విషయం ఉంది. నవంబర్ నెలలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల ఇంటలిజెన్స్ అధికారుల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. వచ్చే ఏడాది జూన్ లోపు చత్తీస్‌ఘడ్, జార?ండ్, బీహార్‌తో సహా దేశంలో ఒక్క మావోయిస్టు కూడా మిగలకుండా చంపేయాలనే నిర్ణయం అక్కడ తీసుకున్నారు. 2017లో అప్పటి హోం మంత్రి రాజనాథ్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ ఆపరేషన్ సమాధాన్‌కు కొనసాగింపుగా అమితషా ఆపరేషన్ ప్రహార్‌ను ఆరంభించాడు. దీన్ని ముందుకు తీసికెళ్లడానికి మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలకు నిధులు, బలగాలు, ఆయుధాలు విరివిగా అందిస్తామని, ఇది చివరి ఆపరేషన్ కావాలనే నిర్ణయం చేశాడు. దీని కోసం పెద్ద ఎత్తున బలగాలను పంపిస్తున్నారు. కొత్తగా చేరే సైనిక బలగాలతో కలిసి సుమారు 20 లక్షల సాయుధులను విప్లవోద్యమ ప్రాంతాలకు కేటాయించినట్లవుతుంది. సరిగ్గా ఈ నిర్ణయం తర్వాత కొద్ది రోజులకే ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ ట్రై జంక్షన్ ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లు, అక్రమ కేసులు, అరెస్టులు తీవ్రమయ్యాయి.

ప్రజా జీవితంలో మానవీయ విలువల కోసం, ప్రజాస్వామిక చైతన్యం కోసం, రాజ్యాంగబద్ధ హక్కుల కోసం ఆలోచిస్తున్న వాళ్లందరూ తమకు ఆటంకంగా తయారయ్యారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. వీళ్ల మాటలు, రాతలు, పనులు న్యూసెన్స్ అనుకుంటున్నాయి. లౌకిక, ప్రగతిశీల, విప్లవ భావజాలాన్ని తుడిచిపెట్టడంలో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ అరెస్టుల పరంపర కొనసాగుతోంది. ఇది ప్రజాసంఘాల మీద దాడి అని విడిగా చూడ్డానికి లేదు. మొత్తంగా లౌకిక, ప్రజాస్వామిక విలువల మీద దాడిగా భావించాలి.

## పార్ట్‌టైమ్ లెక్చరర్లపై ఎందుకీ వివక్ష?



తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అంటే అధికారుల్లో ఒక చులకన భావం ఉంది. వీరందరూ 1994 సంవత్సరం నుంచి పని చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 53 మంది మాత్రమే ఉన్నారు. అందరి వయసు 45 సంవత్సరాల పైనే ఉంటుంది. ఈ ఉద్యోగంలో దాదాపు 25 సంవత్సరాల అనుభవం కలిగినవారు. అయితే పార్ట్‌టైమ్ లెక్చరర్స్ అనగానే అదేదో అంటరానిదని, అవసరం లేనిదని, పనికి రాని ఉద్యోగమని అధికారుల్లో ఒక అపోహ ఉంది. ఇంటర్ బోర్డు కమిషనర్ దగ్గర నుంచి ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యామంత్రి, ఆర్థిక శాఖాధిపతుల వరకు ప్రతి ఒక్కరికీ వీరిపట్ల చులకన భావమే ఉంది. ఒక గంటో, రెండు గంటలో పనిచేసి వెళ్ళిపోతారు ఈ లెక్చరర్లు అన్న భావం ఆయా అధికారుల్లో ఉంది. కానీ క్షేత్రస్థాయిలో జరిగేది వేరుగా ఉంటుంది. వీరు పనిచేసే విధానం గాని, పని గంటలు గాని బోధించే సబ్జెక్టులు గాని రెగ్యులర్ లెక్చరర్ల లాగానే ఉంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యాబోధన చేస్తారు. పేరుకే పార్ట్‌టైమ్ లెక్చరర్లు గాని చేసేది మాత్రం ఫుల్‌టైమ్ ఉద్యోగమే.

ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే లెక్చరర్లు అయిదు కేటగిరీలుగా ఉన్నారు. 1. రెగ్యులర్ లెక్చరర్లు 2. పార్ట్‌టైమ్ ఎంటిఎస్ లెక్చరర్లు (1993కి ముందు) 3. పార్ట్‌టైమ్ లెక్చరర్లు (1993–1999) 4. కాంట్రాక్ట్ లెక్చరర్లు (2000–2016) 5. గెస్ట్ లెక్చరర్లు (2000 తరువాత). వీరిలో రెగ్యులర్ లెక్చరర్లు కాకుండా మిగిలిన వారిని ఆయా సంవత్సరాలలో ఆయా అవసరాలకు తగినట్లు తాత్కాలిక పద్ధతిన తీసుకుని పని చేయించుకుంటున్నారు. 1989లో రాష్ట్రవ్యాప్తంగా వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టి, వాటిని బోధించడానికి రెగ్యులర్‌గా కాకుండా పార్ట్‌టైమ్ పద్ధతిలో లెక్చరర్లను నియమించారు. అప్పుడు రెగ్యులర్, పార్ట్‌టైమ్ అనే రెండు విధానాలు మాత్రమే ఉన్నాయి. పార్ట్‌టైమ్ లెక్చరర్స్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యాబోధనకు వినియోగించేవారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం కొత్త కోర్సులను ప్రవేశపెట్టి వాటిని బోధించడానికి పార్ట్‌టైమ్ పద్ధతిలో 1999 వరకు నియమిస్తూ వచ్చారు. వీరిలో అనేక మందిని ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఆ తరువాత వీరు ప్రిన్సిపాల్‌గాను, ఇంటర్ బోర్డులో విద్యాధికారులుగాను ఉద్యోగం పొంది సేవలు అందించారు. ఉద్యోగాలు రెగ్యులర్ కాని, 1993 వరకు నియమితులైన పార్ట్‌టైమ్ లెక్చరర్లకు వేతనంగా అప్పుడున్న రెగ్యులర్ లెక్చరర్లకు ఇచ్చినట్టే మూలవేతనం, డి.ఎ. చెల్లించారు.

1994 నుంచి 1999 వరకు నియమితులైన పార్ట్‌టైమ్ లెక్చరర్లు (53 మంది) మాత్రం ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నారు. వీరికి ప్రస్తుతం అమల్లో ఉన్న పిఆర్‌సి ప్రకారం పెంచకపోవడం వల్ల నెలకు రూ.21,600 మాత్రమే వేతనంగా పొందుతున్నారు. పిఆర్‌సి ప్రకారం రెగ్యులర్ లెక్చరర్ల మూలవేతనం రూ. 37,100. ఈ మొత్తాన్ని తమకూ చెల్లించాలని పార్ట్‌టైమ్ లెక్చరర్లు సంబంధిత అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ప్రయోజనం కలగలేదు.

తెలంగాణలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, హోంగార్డులు, మున్సిపల్ వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, విద్యావలంటీర్లు, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్ట్ లెక్చరర్ల వంటి అనేక వర్గాల వారికి వేతనాలు పెంచారు. కానీ పార్ట్‌టైమ్ లెక్చరర్లపై ఉన్న చులకన భావంతో వారి వేతనాలను మాత్రం పెంచలేదు. వీరందరూ 25 సంవత్సరాలుగా పనిచేస్తూ వయసు మీరి, చాలీచాలని జీతంతో కుటుంబ అవసరాలు తీర్చలేక అనేక అవస్థలు పడుతున్నారు. ఇకపోతే 2000–2001 సంవత్సరం నుంచి పార్ట్‌టైమ్ పద్ధతిన కాకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో లెక్చరర్లను నియమిస్తూ వచ్చారు. వీరికి తొలుత నెలకు రూ. 4,500 మొదలుకొని పెంచుతూ రూ. 8,500 వరకు చెల్లించారు. మంత్రి హరీష్‌రావు చొరవతో వారి వేతనం నెలకు రూ. 8,500 నుంచి 18,030కు చేరుకుంది. తదుపరి ఆరు నెలల్లోపే రూ. 27,000 గాను, అనంతరం ఒక నెలలోనే రూ. 37,100గాను స్థిరపడింది. 25 సంవత్సరాల సర్వీసు కలిగిన పార్ట్‌టైమ్ లెక్చరర్స్ కన్నా తక్కువ సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఎక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి.

వారికి మరో అన్యాయం కూడా జరుగుతోంది. అదేమిటంటే, తాత్కాలిక పద్ధతిన నియమితులైన పార్ట్‌టైమ్, కాంట్రాక్ట్ లెక్చరర్లు ఎవరికైనా కళాశాల పనిచేసే నెలలు అంటే జూన్ నుంచి మార్చి వరకు 10 నెలలకు మాత్రమే వేతనం చెల్లించేవారు. ఏప్రిల్, మే నెలలకు వేసవి సెలవులని జీతం చెల్లించేవారు కాదు. కొన్నాళ్ళ తరువాత రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఆ రెండు నెలలు కూడా వేతనం చెల్లించాలని ఉత్తర్వు జారీచేసి, అమలుచేసింది. అనేక ప్రయత్నాల తరువాత పార్ట్‌టైమ్ లెక్చరర్లకు కూడా ఏప్రిల్, మే నెలలకు జీతాలు చెల్లించాలని 2019లో జీవో ఇచ్చారు కానీ ఇప్పటివరకు అది అమలు చేయలేదు. అడిగితే ఏవో కుంటిసాకులు చెబుతున్నారు. మా తరువాత పార్ట్‌టైమ్ ఎం.టిఎస్ లెక్చరర్లకు కూడా ఆ సంవత్సరమే జీవో ఇచ్చి అమలు చేశారు. ఈ విధంగా మాకంటే ముందు, తరువాత నియమితులైన వారికి అన్ని విషయాల్లో లాభం చేకూరుస్తూ మాకు మాత్రం తీరని అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికయినా పార్ట్‌టైమ్ లెక్చరర్ల సమస్యను సానుభూతితో పరిశీలించాలని, పిఆర్‌సి ప్రకారం వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

## తుఫాను ముప్పు తప్పేది తీర పరిరక్షణతోనే!



సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల తీవ్రతను తెలుసుకోవడానికేగాని, ఇంకా వాటిని పూర్తిగా నివారించే స్థాయికి ఎదగలేదు. విపత్తుల వల్ల కలిగే ముప్పును తగ్గించే అవకాశాలను ప్రకృతి సహజసిద్ధంగానే ఏర్పాటుచేసింది. దురదృష్టవశాత్తు ఆ సహజ రక్షణ కవచాలు మానవ జోక్యంతో నాశనమవుతున్నాయి. విలయాన్ని అడ్డుకోవడం సాధ్యం కానప్పుడు, కనీసం ముప్పును కాచుకునే సహజ వ్యవస్థలనైనా పెంపొందించుకోవడం ధర్మం. ఆ పనిచేయకపోగా, ఉన్నవాటిని నాశనం చేసుకుంటున్నాం. తీర ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడే మడ అడవులు, సరుగుడు చెట్లు, కొండలమీద పెరిగిన దట్టమైన వృక్షాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. గతఏడాది నవంబరు చివరి వారంలో వచ్చిన నివర్ తుఫాను రైతాంగాన్ని ముంచేసింది. లక్షలాది ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. 19 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిని దాదాపు 9 లక్షలమంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వివిధ రంగాలకు రూ.5,324కోట్ల మేర నష్టం చేకూరినట్లు అంచనా. ప్రతీ ఏటా రాష్ట్రంలో ఇదే పరిస్థితి. హుదూద్, తిత్లీ, పెథాయ్, ఇప్పుడు నివర్... ఇలా వరుస ప్రకృతి వైపరీత్యాలతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోతోంది. ఆంధ్రప్రదేశ్?లో ప్రకృతి వైపరీత్యాలకు ప్రకృతి ప్రకోపంతో పాటు మానవ తప్పిదాలు కూడా కారణమవుతున్నాయి. దీని ప్రభావం ఆర్థిక వ్యవస్థపైనే కాకుండా, విధాన నిర్ణయాలు, రాజకీయ సుస్థిరత, సాధారణ జనజీవనంపైనా పడుతోంది. ఐక్యరాజ్య సమితి విపత్తు నష్ట నివారణ కార్యాలయం విడుదల చేసిన నివేదిక ప్రకారం – వివిధ ఉత్పాతాల కారణంగా భారతదేశం ఏటా రూ.65 వేల కోట్ల మేరకు ఆర్థికంగా నష్టపోతోంది. అందులో కేవలం తుఫాన్ల వల్ల ఏటా రూ.4 వేల కోట్ల పైచిలుకు నష్టం సంభవిస్తోంది.

జనజీవితాల్ని అతలాకుతలం చేస్తున్న ఈ తుఫాన్లని ముందే పసిగట్టి తగిన విధంగా హెచ్చరిస్తున్న మన సాంకేతిక అభివృద్ధిని అభినందించాల్సిందే. జాతీయ విపత్తుల నివారణ సంస్థ ద్వారా మనం అప్రమత్తం కాగలుగుతున్నాం. సైనిక సిబ్బందిని, అధికార సిబ్బందిని తగువిధంగా మోహరించి తుఫాన్ల ప్రమాదాన్ని ఎదుర్కోవడం ఎలాగో నేర్చుకుంటున్నాం. అందుకు అనుగుణంగానే ప్రజలను సైతం మానసికంగా సన్నద్ధం చేస్తున్నాం. ముందే ప్రమాద హెచ్చరికలు ప్రజలందరికీ చేరవేయడం వలన మూడు, నాలుగు రోజులకు సరిపడా ఆహార పదార్థాలు చాలా కుటుంబాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఇటువంటి జాగ్రత్తల ద్వారానే ఉపద్రవాలలో ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోగలుగుతున్నాం. అయితే సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల తీవ్రతను తెలుసుకోవడానికేగాని, ఇంకా వాటిని పూర్తిగా నివారించే స్థాయికి ఎదగలేదు. విపత్తుల వల్ల కలిగే ముప్పును తగ్గించే అవకాశాలను ప్రకృతి సహజసిద్ధంగానే ఏర్పాటుచేసింది. దురదృష్టవశాత్తు ఆ సహజ రక్షణ కవచాలు మానవ జోక్యంతో నాశనమవుతున్నాయి. విలయాన్ని అడ్డుకోవడం సాధ్యం కానప్పుడు, కనీసం ముప్పును కాచుకునే సహజ వ్యవస్థలనైనా పెంపొందించుకోవడం ధర్మం. ఆ పనిచేయకపోగా, ఉన్నవాటిని నాశనం చేసుకుంటున్నాం. తీర ప్రాంతాన్ని కంటికి రెప్పలా కాపాడే మడ అడవులు, సరుగుడు చెట్లు, కొండలమీద పెరిగిన దట్టమైన వృక్షాలు క్రమంగా అంతరించిపోతున్నాయి. తుఫాన్ల సమయంలో అలల ఉధృతికి తీరంలోని ఇసుక కోతలకు గురికాకుండా మడచెట్ల వేర్లు బలమైన వలలుగా పనిచేస్తుంటాయి. రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రంలో 54 వేల హెక్టార్ల మడ అడవులు విస్తరించి ఉండేవి. ఇప్పుడు వాటిలో చాలావరకు నాశనమైపోయాయి. ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష్యం మడ అడవుల విస్తీర్ణం తగ్గిపోవడానికి ముఖ్య కారణమని ఎం.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలోని ఫౌండేషన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. కృష్ణా, గోదావరి నదుల్లో మంచినీటి ప్రవాహం తగ్గిపోవడం, మరోవైపు నదీజలాల్లోకి ఎగువ ప్రాంతాల్లోంచి తరలివచ్చే ఒండ్రు మట్టి తగ్గిపోవడం అడవుల కోతకు దారితీసింది. నదీ పరివాహక ప్రాంతాల్లో ఏర్పాటైన భారీ రసాయన పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల జలాల్లో మార్పులు వచ్చాయి. సముద్రంలోని ఓడల నుంచి వెలువడే చమురు వ్యర్థాలు, చమురు వెలికితీత కార్యక్రమాలు, పంట పొలాలనుంచి విడుదలయ్యే రసాయనాలు సైతం తీరంలో సహజ రక్షణ కవచాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. తూర్పుగోదావరి, గుంటూరు డెల్టా పరిధిలో చాలావరకు అడవులు కబ్జాలకు గురై తరిగిపోతున్నాయి. పర్యావరణాన్ని దారుణంగా దెబ్బకొడుతున్న ఈ ప్రయత్నాలను తక్షణం అడ్డుకోకపోతే– తుఫానులు, పెనుగాలులు ప్రతీసారి రాష్ట్రంలోని తీరప్రాంతాలను అతలాకుతలం చేస్తూనే ఉంటాయి. తీరం నుండి 500 మీటర్ల వరకూ బోర్ వెల్స్ వేయరాదని సి.ఆర్.జెడ్ చట్టం చెపుతోంది. దాన్ని పట్టించుకోకుండా తీరం వెంబడి బోర్‌లు వేసి భూగర్భ జలాలను తోడేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా తుఫాన్లలో బంగాళాఖాతంలో తలెత్తేవి 7 శాతం. సంఖ్యాపరంగా ఇవి తక్కువే అయినా నష్టం మాత్రం భారీగా ఉంటోంది. కోస్తా జిల్లాల్లో మురుగు, వరద నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం రెట్టింపవుతోంది. చాలాసార్లు కాలువలు, చెరువుల గట్లు తెగిపోవడం వల్లే ఎక్కువమంది మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. 1977 నాటి దివిసీమ తుఫాను తరువాత విశాఖపట్నం–కోస్తా తీరం వెంట 146 తుఫాను రక్షణ కేంద్రాలను నిర్మించారు. అయితే అవి సరైన నిర్వహణలేక శిథిలమైపోయాయి. వీటిని పునరుద్ధరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దానితో పాటు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి విపత్తు నిర్వహణ అథారిటీలను కూడా పునరుద్ధరించడం అవసరం. తుఫాన్ల తీవ్రతను తట్టుకుని నిలబడాలంటే– తీరప్రాంతవ్యాప్తంగా గ్రీన్ బెల్ట్ ఏర్పాటుచేయాలి. తీరం వెంబడి మడ అడవులు, సరుగుడు చెట్లు, జీడిమామిడి తోటలు పెంచాలి. ఉప్పుగాలులను తట్టుకునే వనాలను తీరంలో పెంచాలి. వీటితో పాటు తీరప్రాంత జీవావరణాన్ని దెబ్బతీసే విధంగా కట్టడాలు నిర్మించకుండా, స్వార్థ అవసరాల పేరిట మానవ జోక్యం పెరగకుండా చర్యలు తీసుకోవాలి. తీరప్రాంత నియంత్రణ కోసం రూపొందించిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సి.ఆర్.జెడ్) నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. తీరరక్షణకు అవసరమైన సహజ వనరులను విస్తారంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, పౌర సంఘాలు నడుంబిగించాల్సిన సమయం ఆసన్నమైంది.

# వ్యవసాయ చట్టాల వలన దేశ ప్రజలందరికీ తీవ్ర నష్టం

**రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలి**
**రైతు దీక్షలకు సంఘీభావం తెలిపిన సీఎల్పీ నేత భట్టి సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని**



మధిర, జనవరి 07, ప్రజాపాలన :దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలు దేశ ప్రజలందరికీ తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని పేర్కొన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను గురువారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాన్ని కార్పొరేట్లకు కట్ట పెట్టే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ చట్టాలను చేస్తూ దేశ ప్రజలను సంక్షోభంలోకి నెట్టేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. రైతు చట్టాల వలన రైతులకు తీవ్ర నష్టం కలగడంతో పాటు ప్రజల జీవన విధానం అగమ్యగోచరంగా మారుతుందని అన్నారు. నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు రేట్లు పెరిగి సామాన్యులు, పేదవారు తినలేని, బ్రతకలేని పరిస్థితులు ఏర్పడతాయని ఆమె తెలిపారు. రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించే రైతు చట్టాలను రద్దు చేసే వరకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్, ఎస్సీ సెల్ నాయకులు దా రా బాలరాజు, కర్నాటి రామారావు, చిట్టి బాబు తదితరులు పాల్గొనగా దీక్షల్లో అఖిలపక్ష నాయకులు బెజవాడ రవిబాబు, శీలం నరసింహా రావు, పడి కంటి మురళి, దుర్గాప్రసాద్, విద్యార్థి సంఘం నాయకులు వడ్రాణపు మధు, మద్దాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు దీక్షకు మద్దతుగా శ్రీనివాస్ యాదవ్
## మేళం కాంగ్రెస్ టాస్క్ ఫోర్స్ నెంబర్

మధిర, జనవరి 07, ప్రజాపాలన :మధిర నియోజకవర్గం మధిర మండలంలో జనవరి మూడో తారీకు నుండి ఏడో తారీఖు వరకు రైతు సంఘాల నాయకులు లిఅఖిలపక్షం ఆధ్వర్యంలోలి ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఈరోజు కార్యక్రమాన్ని అఖిలపక్ష నాయకుల తో పాటుగా లిజిల్లా కాంగ్రెస్ నాయకులు ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టాస్క్ ఫోర్స్ నెంబర్ మేళం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాల్లో అన్నదాతలు చేస్తున్న కార్యక్రమానికి మద్దతుగా పెద్ద ఎత్తున గ్రామగ్రామాన రైతులు కదం తొక్కాలని లికేంద్ర ప్రభుత్వం చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోజు దీక్ష శిబిరంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ గారు సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి బాబు గారు సిపిఎం కార్యదర్శి సైదులు గారు మరియు రైతు సంఘం నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమానికి సంఘీభావ మద్దతుగా నాయకులు శీలం నరసింహారావు గారు రవి గారు కర్నాటి రామా రావు గారు పాల్గొన్నారు.

## రైతు దీక్షకు మద్దతుగా దెందుకూరు
## మల్లారం,ఎంపీటీసీలు , రైతాంగం

మధిర, జనవరి 07, ప్రజాపాలన :మధిర నియోజకవర్గం మధిర మండలంలో జనవరి మూడో తారీకు నుండి ఏడో తారీఖు వరకు రైతు సంఘాల నాయకులు అఖిలపక్షం ఆధ్వర్యంలోఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఈరోజు కార్యక్రమాన్ని అఖిలపక్ష నాయకుల తో పాటుగా లిమల్లారం ఎంపీటీసీ మందడపు నాగేస్వరరావు గారు దెందుకూరు ఎంపీటీసీ అల్లు రమాదేవి, మహిళా రైతు నాయకులు మందడపు రాణిగారు శరత్,గాలిబ్,అంకబాబు తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాల్లో అన్నదాతలు చేస్తున్న కార్యక్రమానికి మద్దతుగా పెద్ద ఎత్తున గ్రామగ్రామాన రైతులు కదం తొక్కాలని లికేంద్ర ప్రభుత్వం చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోజు దీక్ష శిబిరంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ గారు సిపిఐ పట్టణ కార్యదర్శి బెజవాడ రవి బాబు గారు సిపిఎం కార్యదర్శి సైదులు గారు. ఉట్ల శంకరరావు గారు, కొండూరు నాగేస్వరరావు గారు మరియు రైతు సంఘం నాయకులు దీక్షలో కూర్చున్నారు.

## తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి
## కొప్పుల ఈశ్వర్ ను కలిసిన బోయిని సతీష్



వెల్గటూర్, జనవరి 07 (ప్రజాపాలన) : వెల్గటూర్ మండల తెలంగాణ అంబేద్కర్ యువజన నూతన అధ్యక్షునిగా బోయిని సతీష్ నియమితులైన తరువాత గువారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంకన పల్లి సర్పంచ్ ముల్కల్ల గంగారం పాల్గొన్నారు.

## కంప్యూటర్ ను ప్రారంభించిన ఎంఈఓ భీమయ్య



బీరుపూర్, జనవరి 07 (ప్రజాపాలన): బీరుపూర్ మండలం తాల్లధర్మారం గ్రామంలోని ఎంపిపిఎస్ తాళ్లధర్మారం పాఠశాలలో కంప్యూటర్ ను మండల విద్యాధికారి వాసం భీమయ్య ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా పోటీపడి విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో పాఠశాల ఉపాధ్యాయులు కలిసి ఒక కంప్యూటర్ ను విరాళంగా ఇవ్వడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. ఎస్.ఎస్.సి ఫలితాలు సందర్భంగా తాళ్ళధర్మారం పాఠశాల నుండి గురుకులంలో సీటు పొందిన ఏడుగురు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నల్ల మహిపాల్ రెడ్డి ఎంపీటీసీ నారపాక రమరమేష్ ఎస్ఎంసి చైర్మన్ బద్ది భీమయ్య నారపాక రవీందర్ నారపాక స్వామి కార్యదర్శి ఆదిత్య ఎచ్ఎం రవి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు



సారంగాపూర్, జనవరి 06 (ప్రజాపాలన): సారంగాపూర్ మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో జె. పుల్లయ్య ఆధ్వర్యంలో వివిధ గ్రామాల కార్యదర్శులకు వర్మికంపోస్టు క్రేమాటోరియాస్ కంపోస్ట్ షేడ్స్ నర్సరీస్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యదర్శిపై ఉన్నదని ఎంపీడీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శశికుమార్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఈ నెల 22న స్థాయి కమిటీ సమావేశం

**జిల్లా పరిషత్ కార్యనిర్వాహణ అధికారి నరేందర్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జనవరి 7, ప్రజాపాలన :జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న స్థాయి కమిటీ సమావేశములు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గం॥ల నుండి 11 గం॥ల వరకు స్థాయి కమిటీ–2 (గ్రామీణాభివృద్ధి), ఉదయం 11 గం॥ల నుండి 12 గం॥ల వరకు స్థాయి కమిటీ–3 (వ్యవసాయము), మధ్యాహ్నం 12 గం॥ల నుండి 1 గం॥ల వరకు స్థాయి కమిటీ–4 (విద్య, వైద్య సేవలు), మధ్యాహ్నం 1 గం॥ల నుండి 2 గం॥ల వరకు స్థాయి కమిటీ–5 (మహిళా సంక్షేమం), మధ్యాహ్నం 3 గం॥ల నుండి 4 గం॥ల వరకు స్థాయి కమిటీ–6 (సాంఘిక నంక్షేమం), సాయంత్రం 4 గం॥ల నుండి 5 గం॥ల వరకు స్థాయి కమిటీ–7 (నిర్మాణపు పనులు), స్థాయి కమిటీ–1 (ప్రణాళిక, ఆర్థిక) కమిటీల నమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గౌరవ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో నకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జనవరి 07 ( ప్రజాపాలన ) : యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని పొనగంటి నీలకంఠం (38) మృతి చెందిన సంఘటన రాత్రి సుమారు 7.30 గంటల ప్రాంతంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడ రైల్వే గేట్ వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి జిఆర్ పి ( గవర్నమెంట్ రైల్వే పోలీసులు) లు తెలిపిన వివరాల ప్రకారం..రాజీవ్ గృహ కల్పలో నివాసం ఉంటున్న పొనగంటి జానకమ్మ పొనగంటి కొమురయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలరు. నీలకంఠం పట్టణ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో ఉన్న పాత ఇనుప సామానులు విక్రయించే యజమాని దగ్గర రోజు వారీగా కూలీ పనులు చేసేవాడు. ప్రతి రోజులాగే గురువారం పని కొరకు ఉదయం ఇంటి నుండి బయలు దేరాడు. గుర్తు తెలియని రైలు ఢీకొనడనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పాయింట్ మ్యాన్ గా విధులు నిర్వహించే ఎం.లక్ష్మీనారాయణ గమనించి జిఆర్ పి కానిస్టేబుల్ సిహెచ్.ద్వార కాదాన్ కు సమాచారం అందజేశారు. కానిస్టేబుల్ జిఆర్ పి ఎస్ఐ వెంకట్ రెడ్డికి సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే ఫోర్స్ పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప శవానికి పంచనామా నిర్వహించి, శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామని పోలీసులు తెలిపారు.

## ప్రమాణ స్వీకారం చేసిన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం






జగిత్యాల, జనవరి 07 (ప్రజాపాలన): జగిత్యాల టౌన్ తెలంగాణ ఫెడరేషన్ పట్టణ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా ఏన్నం కిషన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా దుగ్యాల గోపాల్ రావు కార్యవర్గ సభ్యులు గురువారం రోజున ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఏల్ళనాటి సమస్యగా ఉన్న ఇండ్ల స్థలాల మంజూరు విషయంలో కూడ చొరవ చూపిస్తానని పాత్రికేయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత మున్సిపల్ చైర్ పర్సన్ భోగ శ్రావణి ద్యావర సంజీవ రాజు తిరుకోవెల శ్రీనివాస్ తోట హన్మంత్ కాంతరావు మారుతి రవీందర్ రావు రాజలింగం గుర్రం శేఖర్ ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# టీపీసీసీ నియామకం ఎప్పుడో తేల్చేసిన అధిష్టానం

## సాగర్ ఉప ఎన్నిక తర్వాతే కొత్త పీసీసీ

నల్గొండ: టీ.కాంగ్రెస్‌లో కాబోయే పీసీసీ అధ్యక్షుడు ఎవరనే చర్చ జరుగుతున్న వేళ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జ్ మాణికం ఠాగూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. సాగర్ ఉప ఎన్నిక తర్వాతే కొత్త పీసీసీ అధ్యక్షుడిని నియమించనున్నట్లు ఆయన ప్రకటించారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నిక ముగిసే వరకూ ప్రస్తుత పీసీసీ కొనసాగుతారని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్‌గా ఉత్తమ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు కొనసాగనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి సాగర్ ఉప ఎన్నిక తర్వాతే పీసీసీని నియమించాలని ఇప్పటికే అధిష్టానానికి స్పష్టమైన సంకేతాలు పంపిన సంగతి తెలిసిందే. ఈలోపే పీసీసీ విషయంలో తర్జనభర్జన, రోజుకో పేరు తెరపైకి రావడం పార్టీకి నష్టం చేసే అవకాశం ఉందని భావించిన కాంగ్రెస్ అధిష్టానం ఉప ఎన్నిక తర్వాతే పీసీసీని నియమించాలన్న నిర్ణయాని కొచ్చింది. దుబ్బాక ఉప ఎన్నికలో ఘోర ఓటమి చవిచూసిన హస్తం పార్టీ నాగార్జున సాగర్‌లోనైనా పరువు నిలుపుకోవాలని భావిస్తోంది. సాగర్ ఉప ఎన్నికలో విజయం కోసం పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా పనిచేస్తాయని ఠాగూర్ చెప్పారు. సాగర్ ఉప ఎన్నిక కాంగ్రెస్‌కు అత్యంత కీలకమని, కాంగ్రెస్ పునరుజ్జీవానికి సాగర్ ఉప ఎన్నిక విజయం దోహదం చేస్తుందని ఠాగూర్ అభిప్రాయపడ్డారు. 162 మంది నాయకుల అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే ఈ నిర్ణయానికొచ్చినట్లు ఠాగూర్ తెలిపారు.




## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి:
## చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ కు వినతి



చొప్పదండి, జనవరి 07 (ప్రజాపాలన): చొప్పదండి నియోకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సెస్ ఎండీ రామకృష్ణ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గతంలో కూడ మాజీ ఎంపీ వినోద్ కుమార్ కు కూడా లేఖ రాయడం జరిగిందని. ఆయా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలో పోయిన విద్యుత్ తీగలను తీసేసి కొత్తవాటిని అమర్చాలని అన్నారు. రైతు వేదిక నుండి స్మశాన వాటిక వరకు కొత్త లైన్ వేయాలని సూచించారు. బోయిన్ పల్లి మండలం జగ్గారావుపల్లి 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. బోయినపల్లిలో 132 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం తొందరగా పూర్తి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.

## బండి సంజయ్
## సవాల్‌ను లైట్‌గా తీసుకున్న టీఆర్ఎస్



వరంగల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సవాల్‌ను టీఆర్ఎస్ లైట్‌గా తీసుకుంది. 48 గంటలు గడిచినా భద్రకాళీ ఆలయానికి టీఆర్ఎస్ నేతలు రాలేదు. 196కోట్ల స్మార్ట్ సిటీ నిధుల గల్లంతుపై టీఆర్ఎస్ నేతలకు బండి సంజయ్ సవాల్ విసిరారు. ఆధారాలతో బీజేపీ నాయకులు భద్రకాళీ ఆలయానికి చేరుకున్నారు. ఓరుగల్లులో బీజేపీ– టీఆర్ఎస్ పొలిటికల్ వార్ ముదురుతోంది. రూ.196కోట్ల స్మార్ట్ సిటీ నిధుల దారి మళ్లింపుపై భద్రకాళి అమ్మవారి ఆలయం వేదికగా బహిరంగంగా సవాళ్లు విసురుకుంటున్నారు. బండి సంజయ్ భద్రకాళి అమ్మవారి సాక్షిగా ప్రమాణం చేసి ఆ నిధుల దారి మళ్లింపుపై బహిరంగ ప్రకటన చేయాలని 48 గంటల డెడ్ లైన్ విధించించిన విషయం తెలిసిందే. మరోవైపు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బండి సంజయ్‌కు కౌంటర్ సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధికోసం పవిత్రమైన భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అపవిత్రం చేయవద్దని హితవు పలికారు. బండి సంజయ్‌కి దమ్ముంటే తన కన్న తల్లి మీద ప్రమాణం చేసి వాస్తవాలు మాట్లాడాలని ప్రతి సవాల్ చేశారు.

# 100 శాతం ఆక్యుపెన్సీ కుదరదు

**న్యూఢిల్లీ, జనవరి 7, (ప్రజాపాలన) :** సినిమా ప్రదర్శనల సందర్భంగా కొవిడ్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కేంద్రం స్పష్టం చేసింది. సినిమా హాళ్లకు, మల్టీప్లెక్సులకు 50 శాతం ప్రేక్షకులతో మాత్రమే సినిమా ప్రదర్శనలు అనుమతిచ్చామని తెలిపింది. ఈ ఆంక్షలను జనవరి 31 వరకు పొడిగించామని గుర్తు చేసింది. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలను ఏ రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతం కూడా తమకు అనుగుణంగా మార్చుకోరాదని స్పష్టం చేసింది. తమిళనాడు ప్రభుత్వం తీసకున్న నిర్ణయం వివాదాస్పదం కావడంతో కేంద్ర హోం శాఖ స్పందించింది. సినిమా థియేటర్స్‌లో సీటింగ్ సామర్థ్యాన్ని 50 శాతం నుంచి 100 శాతానికి పెంచుకోవచ్చుంటూ తమిళనాడు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నిర్ణయంపై వ్యతిరేకత తెలుపుతూ చాలా మంది గళమెత్తారు. సోషల్ మీడియాలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. కోలీవుడ్‌కు చెందిన కొంత మంది ప్రముఖులు కూడా ప్రభుత్వం ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

తాజాగా ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వానికి కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఓ లేఖ రాశారు. దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి ఇంకా కొనసాగుతోం దని, దీనికి తోడు కరోనా కొత్త వైరస్ స్ట్రెయిన్ కేసులు కూడా నమోదవుతున్నాయని.. ఇలాంటి తరుణంలో సినిమా హాళ్లు, మల్టీప్లెక్సుల్లో 100 శాతం సీటింగ్ సామర్థ్యంతో సినిమా ప్రదర్శనకు అనుమతివ్వడం సమంజసం కాదని లేఖలో పేర్కొన్నారు. తమిళనాడు ప్రభుత్వం ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని సూచించారు. తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం కేంద్రం డిసెంబరు 28న జారీ చేసిన కొవిడ్-19 మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉందని కేంద్ర హోం శాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. 100 శాతం సీటింగ్‌తో సినిమా ప్రదర్శనల ఆదేశాలను ఉపసంహరించుకోవాలని, తమ ఆదేశాన్ని పాటించాలని తమిళనాడు ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు కూడా ఇప్పటికీ మాస్కులు, భౌతిక దూరం నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసిందని లేఖలో పేర్కొన్నారు. తమిళనాడులో సినిమా హాళ్లలో సీటింగ్ కెపాసిటీని 100 శాతానికి పెంచడాన్ని అరవింద్ స్వామి వ్యతిరేకించారు. అలనాటి నటి, ఇటీవల బీజేపీ పార్టీలో చేరిన ఖుష్బూ తమిళ సర్కార్ నిర్ణయానికి మద్దతు పలికారు.

పుదిచ్చేరికి చెంది న ఒక వైద్యుడు 100 శాతం సీటింగ్ అవకాశాన్ని తప్పుపడుతూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశా రు. అది బాగా వైరల్ అయ్యింది. ఈ పోస్టును ట్యాగ్ చేస్తూ కొందరు తమిళ సినీ ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను తప్పుబట్టారు. టాలీవుడ్‌లోనూ 100 శాతం ఆక్యుపెన్సీకి అవకాశం కల్పించాలని కోరుతూ రెండు తెలుగు రాష్ట్రాల నిర్మాతల మండలి విజ్ఞప్తి చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కరోనా లాక్‌డౌన్‌తో బాగా నష్టపోయిన రంగాల్లో సినీ పరిశ్రమ ఒకటి. సంక్రాంతి పండుగ నుంచి మళ్లీ బిజినెస్ పుంజుకుంటుందని నిర్మాతలు, సినిమా థియేటర్ల యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జనవరి 13న హీరో విజయ్ నటించిన 'మాస్టర్' విడుదల కానుంది. రవితేజ నటించిన క్రాక్, శింబు నటించిన ఈశ్వరన్ సినిమాలు సంక్రాంతికి సందడి చేయనున్నాయి.

# ఇమేజ్ కోసం రఘురామ ప్రయత్నాలు



**ఏలూరు, జనవరి 7, (ప్రజాపాలన) :** వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణం రాజు నిత్యం జగన్ ప్రభుత్వంపై విరుచుకు పడుతున్నారు. ప్రధానంగా హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులపై ఆయన నిత్యం కామెంట్స్ చేస్తున్నారు. రచ్చబండ పేరుతో రఘురామకృష్ణంరాజు రోజు జగన్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేస్తున్నా వైసీపీ మాత్రం కిమ్మనడం లేదు. నిజానికి రఘురామకృష్ణంరాజు పై లోక్ సభ స్పీకర్ కు అనర్హత పిటీషన్ వైసీపీ నేతలు ఇచ్చి ఆరు నెలలు దాటుతుంది. ఇప్పటి వరకూ ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆయన ఎక్కువగా ఢిల్లీలోనే ఉండటంతో ఎప్పటికప్పుడు స్పీకర్ కార్యాలయంలో ఫాలో అప్ చేసుకుంటున్నారు. అలాంటిదేమీ లేకపోవడంతో రఘురామకృష్ణంరాజు నిత్యం కయ్యానికి కాలు దువ్వుతున్నారు. వైసీపీ నేతలు కూడా బీజేపీ పెద్దలను కలిసినప్పుడల్లా రఘురామకృష్ణంరాజు అంశాన్ని ప్రస్తావిస్తూనే వస్తున్నారు. కానీ బీజేపీ పెద్దల నుంచి ఎలాంటి సంకేతాలు లేవు. ఇప్పటికే ఆరు నెలలు గడిచిపోవడం, రఘురామకృష్ణంరాజు ఆరోపణలు శృతిమించడంతో వైసీపీ నేతలు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అయితే రఘురామకృష్ణంరాజు మాత్రం బిందాస్ గా ఉన్నారంటున్నారు. ఇటీవల అరుణాచల్ ప్రదేశ్ లో తన మిత్రపక్షమైన జేడీయూ నుంచి ఆరు గురు ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు తన సన్నిహితుల వద్ద గుర్తు చేస్తున్నారట. మిత్రపక్షాన్నే కలుపుకున్న బీజేపీ వైసీపీని కేర్ చేస్తుందని తాను అనుకోవడం లేదని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. రఘురామకృష్ణంరాజు మాత్రం బీజేపీలో చేరే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఒక కేంద్ర మంత్రి ద్వారా తన ప్రయత్నాలను రఘురామకృష్ణంరాజు మొదలు పెట్టారంటున్నారు. కేంద్ర మంత్రి భర్త కూడా తన జిల్లా కావడంతో ఆయన ద్వారా సులువుగా పనిచేయించుకునే పనిలో ఉన్నారు రఘురామకృష్ణంరాజు. మరి ప్రయత్నం సఫలమయితే తనకు త్వరలోనే బీజేపీ నుంచి ఆహ్వానం అందుతుందని రఘురామకృష్ణంరాజు భావిస్తున్నారట. అప్పుడు వైసీపీకి మరింత సినిమా చూపిస్తానంటున్నారు. మరి రఘురామకృష్ణంరాజు విషయంలో ఏం జరుగుతుందో చూడాలి.

# వెల్లంపల్లి... ఔట్..?



**విజయవాడ, జనవరి 7, (ప్రజాపాలన) :** ఇద్దరు మినిస్టర్ లు సీఎంకు తలనొప్పిగా మారారట. సీఎం జగన్ కూడా అనలేక.. అనకుండా ఉండలేక ఇబ్బంది పడుతున్నారట. అసలు.. వంద మెట్లెక్కినా.. ఒక్కసారి కాలు జారితే అక్కడ్నుంచీ పడిపోవడం ఖాయం. తప్పదు. అలా నడిస్తే అంతే ఉంటుంది. పాలిటిక్స్ లో కూడా అంతే. బర్ర బర్ర ఎదిగొచ్చిన లీడర్ కొడాలి నాని. యంగ్ అండ్ డైనమిక్ లీడర్ గా పేరుంది. దానికి తగ్గట్లు దూకుడు కూడా ఎక్కువే. తక్కువ వయసులోనే అంత స్థాయికి చేరారు అనే రెస్పెక్ట్ కూడా ఎక్కువే. కానీ.. ఏం చేస్తారు. సార్ కి కాస్త టంగు స్లిప్ ఎక్కవ సార్లు అవుతుంటుంది. ఒక్కోసారి ఆవేశంలో ఎంత దాకా అయినా వెళ్తుంటారు. అదే నానికి ప్రాబ్లమ్ తెచ్చిపెట్టింది. మొన్న పేకాట క్లబ్బుల ఎవ్వారం ఇంతే జరిగింది. పవన్ కల్యాణ్ గుడివాడ పేకాట క్లబ్బులపై కామెంట్స్ చేస్తే.. అసలు పేకాట క్లబ్బులే లేవన్నారు. తక్కువ గ్యాప్ లోనే పేకాట క్లబ్బులపై దాడులు జరిగాయి. పట్టేసుకున్నారు. దీంతో.. సెల్ఫ్ గోల్ వేసుకున్నట్లైంది నాని పరిస్థితి. పైగా.. పేకాట ఆడితే ఉరిశిక్ష వేస్తారా.. అదేమైనా పెద్ద ఇదా అంటూ.. మినిస్టర్ హోదాని మరిచి మాట్లాడారు. దీంతో.. నువ్వేం మినిస్టర్ వి సారూ అంటున్నారు జనాలు. ఇక ప్రతిపక్షాలు ఊరుకుంటాయా.. ఆడేసుకుంటున్నాయి. కొడాలి నాని అంటే.. సీఎం జగన్ పై ఈగ వాలినా.. తాట తీస్తా అనే టైప్. కానీ.. ఇప్పుడు ఆయన్నే ఇబ్బందుల్లో పడేశారు. ఇక వెల్లంపల్లి శ్రీనివాస్ పరిస్థితి కూడా అదే. అశోక్ గజపతి రాజు ఇష్యూలో నానా మాటలు పడుతున్నారు. మామూలుగా టీడీపీ లీడర్ అశోక్ గజపతి రాజుకి ఓ రెస్పెక్ట్ ఉంది. ప్రత్యర్థులు కూడా ఆయనపై చీప్ లాంగ్వేజ్ తో కామెంట్స్ చేయరు. కానీ.. వెల్లంపల్లి ఏమో.. కాస్త డోస్ పెంచి మరీ మాట్లాడారు. దీంతో.. టీడీపీతో పాటు.. ఆయన వర్గం తరపున కూడా భారీ నెగిటివిటీ వచ్చింది. ఇక వైసీపీలో కూడా చాలామంది వెల్లంపల్లినే అంటున్నారట. గజపతిరాజు విషయంలో అలాంటి కామెంట్స్ చేయకుండా ఉండాల్సింది అంటున్నారట. మినిస్టర్ అయి ఉండి.. హోదా మర్చిపోయి మాట్లాడుతున్నారు అని.. సొంత పార్టీ లీడర్లే.. తలంటి పోస్తున్నారట.

# ఒకే దేశం ఎన్నికపై కసరత్తు

**న్యూఢిల్లీ, జనవరి 7, (ప్రజాపాలన) :** బీజేపీ అగ్రనేత, ప్రధాని నరేంద్ర మోడీ.. ఇటీవల కాలంలో మరోసారి జమిలి ఎన్నికలను తెర మీదికి తెచ్చారు. ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్ నినాదంతో ఆయన అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారు. ఇప్పటికే పౌరసత్వ చట్టంలో మార్పులు చేశారు. జమ్ము కాశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి.. ఇప్పటి వరకు దేశంలోని అన్ని ప్రాంతాలు.. ఒకటిగా.. జమ్ము కశ్మీర్ ఒక్కటి ఒకటిగా ఉన్న విధానానికి తెరదించారు. అదే సమయంలో ట్రిపుల తలాక్‌ను రద్దు చేయడంతోపాటు.. సాధారణ ఇతర వర్గాల మహిళలకు ఉన్న వివాహ హక్కులనే ముస్లిం మహిళలకు వర్తించేలా చట్టాలు తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు జరిపించాలనేది మోడీ వ్యూహం. అందుకే ఆయన దీనిపై ఎక్కువగా కసరత్తు చేస్తున్నారు. అయితే.. జమిలి ఇప్పుడే వచ్చిన నినాదం కాదు.. గతంలో అంటే.. మోడీ తొలి ఐదేళ్ల పాలన ముగియకముందు గానే జమిలి నినాదం జోరుగా వినిపించింది. 2017-18 కూడా జమిలి కోసం మోడీ ప్రయత్నాలు చేశారు. అయితే.. అప్పటి ఎన్నికల సంఘం కమిషనర్.. సాధ్యం కాదని తేల్చేశారు. దీంతో అది మూలన పడింది. ఇక, ఇప్పుడు మరోసారి జమిలి అంటూ.. ప్రధాని ప్రకటన చేయడం.. ఆ వెంటనే కేంద్ర ఎన్నికల కమిషనర్ కూడా సై! అంటూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. మొత్తంగా చూస్తే.. జమిలికి రంగం సిద్ధం అవుతోంది. లా కమిషన్ ద్వారా.. రాజ్యాంగపరంగా చేయాల్సిన మార్పు, చేర్పుల గురించి ఇప్పటికే మోడీ నివేదిక తెప్పించుకున్నారని సమచారం. ఇక, ఇప్పటికే తెలుగు రాష్ట్రాలు సహా అన్ని పార్టీల అభిప్రాయాలనూ తెలుసుకున్నారు. దీంతో ఈసారి జమిలి ఎన్నికలు ఖాయమేనని అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఓ అభిప్రాయం ఏర్పడిపోయింది. అయితే.. మోడీ పైకి చెబుతున్నట్టు ఒక దేశం.. ఒకే సారి ఎన్నికలు అనే విషయం వెనుక కేవలం.. ఎన్నికల ఖర్చును తగ్గించుకోవడం, ప్రక్రియను సాగదీయకుండా.. నెలల తరబడి ప్రభుత్వ యంత్రాంగాలు ప్యారలైజ్ కాకుండా చూడడమే ఉందా ? లేక ఇంకా ఏమైనా ఉందా ? అంటే.. కీలకమైన కాంగ్రెస్ పార్టీ భయం ఆయనను వెంటాడుతోందని చెబుతున్న వారు, అదే సమయంలో తన సర్కారుపై కొన్ని రాష్ట్రాల్లో వ్యతిరేకత వస్తోందన్న విషయం మోడీ ఇప్పటికే గ్రహించారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వంలో నిరుద్యోగం అదేవిధంగా ఉంది. ఆయన విధానాలతో ఆర్థిక వ్యవస్థ పుంజుకోలేదు. పైగా నిత్యావసర ధరలు ఆకాశానికి అంటా యి. పెట్రోల్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో మోడీపై సహజంగానే వ్యతిరేకత ఉంది. ఇది అంతిమంగా కాంగ్రెస్ కు అనుకూలంగా మారడం ఖాయ మని విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. అయితే.. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మోడీ వ్యూహాత్మ కంగా జమిలి తీసుకువచ్చారని మేధావులు భావిస్తున్నారు. ఇప్పుడు జమిలి నిర్వహించినా.. అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే తరహా పరిస్థితి ఉండదు. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మధ్యలో కూలిపోయినా.. లేక ప్రభు త్వాలు బర్తరఫ్ అయినా.. పరిస్థితి ఏంటి? అనేది ఇప్పటికీ అంతు చిక్కడం లేదు. విశాలమైన మన దేశంలో, రాష్ట్రాల్లో ఉన్న రాజకీయ భిన్నత్వం నేపథ్యంలో జమిలి సాధ్యం కాదని అంటున్నారు. మరి మోడీ ఏం చేస్తారో చూడాలి

# సజ్జల అయితే ఏంటీ



**విజయవాడ, జనవరి 7, (ప్రజాపాలన) :** ఏపీ ప్రభుత్వంలో ఇప్పుడు సలహాదారుల రాజ్యం నడుస్తోంది. ప్రభుత్వంలో మంత్రులు ఉన్నా.. పార్టీకి ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నా కూడా సలహాదారులే జగన్‌కు, వీళ్లకు వారధిగా ఉంటూ అన్ని పనులు చక్క పెట్టేస్తున్నారు. దీంతో పార్టీలో పైకి చెప్పుకోకపోయినా చాలా మంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉం టే రాష్ట్ర ప్రభుత్వానికి సంబందించిన అన్ని పనులు, ప్లాన్‌లను ఇటీవల కాలంలో రాజకీయ సలహాదారు.. సజ్జల రామకృష్ణారెడ్డి చూస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఎవరికి ఏది కావాలన్నా.. సజ్జల రామకృష్ణా రెడ్డి అను మతి పొందాల్సి వస్తోంది. కొందరికి ఈ తరహా వ్యవహారం నచ్చడం లేదు. ముఖ్యంగా ప్రజాప్రతినిధుల మాట ఎలా ఉన్నా.. మంత్రులు నేరుగా సజ్జల రామకృష్ణా రెడ్డిని కలిసి.. తమ వ్యవహారాలను వివరించాలన్న నిబంధనను పట్టించుకోవడం లేదు. పైగా లైట్ తీసుకుంటున్నారు. మేం ప్రజా ప్రతినిధులం.. ఆయన కేవలం సలహాదారు మాత్రమే అంటున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన మంత్రి ఒకరు ఓ కీలక విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి అయితే.. ఏంటి ? ఆయన చెప్పినట్టు అంతా చేయాలంటే కుదరదు. అంటూ.. చేసిన వ్యాఖ్యలు.. వైసీపీ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కొన్నాళ్లుగా చాలా వ్యవహారాల్లో సజ్జల చెప్పిందే వ్యూహం అన్నట్టుగా మంత్రులు కూడా చేయాల్సి వస్తోంది. అయితే .. దీనిని కొందరు వింటున్నారు. మరికొం దరు వినడం లేదు. ఇక, ఇప్పుడు.. ఓ కీలక విషయంలో సజ్జల రామకృష్ణా రెడ్డి చేసి న ఆదేశాలను వినేది లేదని.. అధికారులు ఆయన మాట వింటా రో.. తన మాట వింటారో చూస్తానని కూడా సదరు ఫైర్ బ్రాండ్ మంత్రి అన్నారని వైసీపీలో చర్చ జరుగుతోంది. చిత్రం ఏంటంటే.. అధికారులు ఈ ఇద్దరి మధ్య నలిగిపోతుండడమే. అటు ఆయన చెప్పింది.. వినకపోతే .. ఏకంగా ప్రధాన కార్యదర్శి నుంచి చీవాట్లు తినాలి. పోనీ.. మంత్రి చెప్పింది వినకపోతే.. నేరుగా మంత్రితో తిట్లు తినాలి. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందినఓ అధికారి ఎప్పుడో ఉన్న సంక్రాంతి సెలవులను నాలుగు రోజుల కిందటే పెట్టి వెళ్లిపోయారట. అంతేకాదు.. ఈ గొడవలు తీరి.. ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాక.. అంతా సర్దు మణిగిన తర్వాత వస్తానంటూ.. ఆయన చెప్పారని ద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తుండడం గమనార్హం. సజ్జల రామకృష్ణా రెడ్డి ఆయనకు అప్పగించిన పార్టీ వ్యవహారాలు, జిల్లాలతో పాటు ఓవరాల్‌గా ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోనూ కాళ్లు, వేళ్లు పెడుతున్నారన్నదే కొద్ది రోజులుగా వైసీపీ వర్గాల్లో వినిపించే టాక్.

# తమిళనాడులో డోర్ క్లోజ్

**చెన్నై, జనవరి 7, (ప్రజాపాలన) :** తమిళనాడులో రజనీకాంత్ ప్రకటన తర్వాత రాజకీయ పరిణామాలు వేగంగా మారనున్నాయి. ఇప్పటి వరకూ అన్నాడీఎంకే కూటమి అధికారంపై ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా బీజేపీ రజనీకాంత్ సాయంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి డీఎంకే కూటమిని దెబ్బతీయాలని తలపోసింది. అయితే రజనీకాంత్ తాను రాజకీయ పార్టీని పెట్టబోనన్న ప్రకటనతో బీజేపీ తమిళనాడు శిబిరంలో టెన్షన్ మొదలయింది. మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లోనే ఏమాత్రం ప్రభావం బీజేపీ చూపలేదు. అన్నాడీఎంకే కూటమి పైకి బలంగా కన్పిస్తున్నా అది అధికారంతో కూడుకున్నదేనన్నది అందరికీ తెలిసిందే. అయినా పళినిస్వామి, పన్నీర్ సెల్వంను ముందు పెట్టి తాను రాజకీయ ఆటను బీజేపీ ప్రారంభించింది. ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉండటం, సమర్థమైన నాయకత్వం లేకపోవడంతో బీజేపీ రజనీకాంత్ పార్టీ వస్తే బెటరని భావించింది. అనేక రాష్ట్రాల్లో చేసిన ప్రయోగాన్నే తమిళనాడులోనూ ఉపయోగించాలని చూసింది. కానీ రజనీకాంత్ రాజకీయ పార్టీని పెట్టడం లేదని ప్రకటించడంతో బీజేపీలో నిరాశ మొదలయింది. ఇప్పుడు అన్నాడీఎంకే కూటమిని బలోపేతం చేయాల్సిన బాధ్యత బీజేపీపైనే ఉంది. కమల్ హాసన్ బీజేపీ అంటేనే కాలు దువ్వుతున్నారు. తమిళనాడులో మతపరమైన, హిందుత్వ రాజకీయాలు పనిచేయవు. అందుకే రజనీకాంత్‌ను ప్రయోగించాలని చూసినా అది వికటించడంతో మరో మార్గం కోసం బీజేపీ అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో ఎవరు కాదన్నా శశికళకు కొంత ఇమేజ్ ఉంది. ఆమె క్రేజ్ ఇంకా తగ్గిపోలేదు. అందుకే వచ్చే నెలలో విడుదలయ్యే శశికళను అన్నాడీఎంకేకు దగ్గర చేయాలన్న ప్రయత్నంలో బీజేపీ ఉన్నట్లు తెలుస్తోంది. శశికళ కూడా జయలలిత ఆశయాలు నెరవేర్చాలని చెప్పడం, పళనిస్వామి, పన్నీర్ సెల్వం అమ్మ బొమ్మతోనే ఎన్నికలకు వెళుతుండటంతో శశికళను అన్నాడీఎంకే కు సన్నిహితం అయ్యేలా చేయాలన్నది బీజేపీ ప్లాన్ గా తెలుస్తోంది. అయితే ఇది అంత సులువు కాదు. ఆమెకు పార్టీ పూర్తిగా అప్పగిస్తేనే అందుకు అంగీకరిస్తారు. ప్రస్తుతం ఆ పరిస్థితి అన్నాడీఎంకేలోలేదు. అందుకే రజనీకాంత్ ప్రకటనతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ కనపడుతుంది.

# ఆర్జేడీ, జేడీయూ కలిసిపోతాయా

**పాట్నా, జనవరి 7, (ప్రజాపాలన) :** బీహార్ లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జేడీయూ, ఆర్జేడీలు కలిసిపోతాయన్న ప్రచారం జోరుగా సాగుతుంది. అరుణాచల్ ప్రదేశ్ లో జేడీయూ ఎమ్మెల్యేలను ఆరుగురిని బీజేపీలోకి తీసుకోవడంతో నితీష్ కుమార్ కు, బీజేపీ అధినాయకత్వానికి మధ్య గ్యాప్ ఏర్పడింది. కూటమిలో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై నితీష్ కుమార్ అసంతృప్తితో ఉన్నారు. ఈ విషయాన్ని ఆయన బహిరంగంగానే చెప్పారు. దీంతో జేడీయూ ఎమ్మెల్యేలకు ఆర్జేడీ వల వేస్తుంది. ఇప్పటికే జేడీయూకు చెందిన పదిహేను మంది ఎమ్మెల్యేలు ఆర్జేడీ చీఫ్ తేజస్వి యాదవ్ తో టచ్ లో ఉన్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు మరికొందరు వస్తే ఆర్జేడీ అధికారంలోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ మేరకు నితీష్ కుమార్ కు ఆర్జేడీ నుంచి ప్రతిపాదన కూడా అందినట్లు తెలుస్తోంది. నితీష్ కుమార్ కు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో యూపీఏ తరుపున ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తామని, తేజస్వి యాదవ్ కు ముఖ్యమంత్రి దక్కేలా సహకరించాలని నితీష్ కుమార్ ను కోరారు. అయితే గతంలోనే లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేసిన నితీష్ కుమార్ ఆ పార్టీతో జత కట్టే అవకాశం ఉండకపోవచ్చు. ఆర్జేడీ తో జతకలిస్తే బీహార్ రాజకీయాలకు నితీష్ కుమార్ దూరం కావాల్సి ఉంటుంది. ఏడో సారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నితీష్ కుమార్ కు బీజేపీ నుంచి ప్రస్తుతం ఇబ్బంది లేదు. నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని బీజేపీ పదే పదే చెబుతుంది. అయితే అరుణాచల్ ప్రదేశ్ లో తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకోవడాన్ని నితీష్ కుమార్ తప్పు పడుతున్నారు. అలాగే లోక్ జనశక్తి పార్టీ ని దగ్గరకు తీసుకోవడాన్ని కూడా నితీష్ కుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నార. గత ఎన్నికల్లో చిరాగ్ పాశ్వాన్ తన పార్టీ ఓటమికి కృషి చేశారని, అటువంటి వారిని ఎన్డీఏలోకి చేర్చుకోవద్దని కూడా బీజేపీకి నితీష్ కుమార్ తెలిపినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ప్రచారం జరుగుతున్నట్లు అంత సులువుగా నితీష్ కుమార్ బీజేపీని వీడరన్న వాదన అయితే బలంగా ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కంగనా, ఊర్మిళ మధ్య వార్...

ముంబై, జనవరి 7, (న్యూస్ పల్స్) బాలీవుడ్ డేరింగ్ అండ్ డ్యాషింగ్ నటి కంగనా రౌనత్ ఎప్పుడూ ఏదో అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా నటి ఊర్మిళపై ఆమె చేసిన ట్వీట్లతో మళ్లీ కంగన, ఊర్మిళ మధ్య వార్ మొదలైందా అన్న చర్చ నడుస్తుంది. కాంగ్రెస్ నుంచి శివసేనలో చేరిన కొద్దిరోజులకే ఊర్మిళ 3 కోట్ల విలువైన ఫ్లాట్‌ను కొనుగోలు చేశారంటూ కంగనా ట్వీట్ చేసింది. అంతేకాదు ఊర్మిళకు చురకలు అంటిస్తూ తన బాధనంతా ఆ ట్వీట్ లో చెప్పుకొచ్చింది కంగనా. "ఊర్మిళాజీ.. నేను కష్టపడి సంపాదించిన డబ్బుతో కట్టుకున్న ఇళ్లను కాంగ్రెస్ కూల్చి వేయించింది. బీజేపీని మెప్పించడంతో నా మీద 30 కేసులు నమోదయ్యాయి. మీరు మీ తెలివితేటలతో కాంగ్రెస్‌ను సంతోష పరుస్తున్నారు? నేను కూడా మీలా తెలివితో ప్రవర్తించి ఉండాల్సింది..అయ్యో నేను ఎంత తెలివితక్కువదాన్నో కదా? అంటూ వ్యంగ్యంగా ట్వీట్ చేసింది కంగనా. కంగన చేసిన వ్యాఖ్యలను ఊర్మిళ వెంటనే రిప్లై ఇచ్చారు. తాను ఎవరి దయాదాక్షిణాలతోనూ ఇల్లు కొనుగోలు చేయలేదన్నారు. సినీ పరిశ్రమలో పాతికేళ్లు కష్టపడి సంపాదించిన డబ్బుతోనే ఫ్లాట్ కొన్నానని చెప్పుకొచ్చారు ఊర్మిళ. రాజకీయాల్లోకి రాకముందే.. 2011లోనే దాన్ని కొనుగోలు చేశానన్నారు. దానికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని చెప్పింది ఊర్మిళ. అంతేకాదండోయ్.. కంగనాకు సవాల్ కూడా విసిరింది. "ఏయ్ కంగనా.. ప్లేస్ నువ్వే చెప్పు.. అక్కడికే వచ్చి ప్లాట్‌కు సంబంధించిన డ్యాక్స్ మెంట్స్ చూపిస్తా" అంటూ సవాల్ విసిరింది ఊర్మిళ. ప్రజలు కట్టిన కోట్లాది పన్నుల ద్వారా నీవు వై క్యాటగిరీ భద్రతను ఎంజాయ్ చేస్తున్నావంటూ కంగనాపై మండిపడింది. బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ క్వీన్ కంగనా రౌనత్.. రంగీలా భామ ఊర్మిళ మధ్య ఇలాంటి గొడవలు కొత్తేమీ కాదు. వీరిద్దరి మధ్య గతంలోనూ సోషల్ మీడియా వేదికగా మాటల వార్ నడిచింది. సుశాంత్ ఆత్మాహత్య తర్వాత బాలీవుడ్ లో బంధు ప్రీతి ఉంది అంటూ కంగనా చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో ఊర్మిళా మండి పడింది. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య వివాదం మొదలైంది. బాలీవుడ్‌లో మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నవారి పేర్లు తనకు తెలుసంటూ కంగన వ్యాఖ్యలు చేసింది. దీంతో ఊర్మిళ.. ఆ జాబితాను పోలీసులకు అందజేయాలంటూ చురకలు అంటించింది.

# పొట్ట అంతా హాయిగా...



ఎంతసేపూ, కడుపులోంచి వస్తున్న శబ్దాలవైపే మనసు వెళుతుంటే, ఎదురుగా ఉన్నది ఏం కనపడుతుంది! ఎదుటివాళ్లు చెప్పేది ఏం వినపడుతుంది! నిరంతరం మలబద్ధకంతో సతమతమయ్యే వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది మరి! మనం తీసుకునే ఆహారం ఎంత గొప్పదైనా కావచ్చు.

అందులో ఏదో ఒక మోతాదులో వ్యర్థాలు లేకుండా ఉండవు కదా! అ వ్యర్థాలన్నీ పూర్తిస్థాయిలో విసర్జించబడుతున్నాయా, లేదా అని ఎంత మంది ఆలోచిస్తారు? నిజానికి, అనేక రుగ్మతలకు ఆరంభ దశ, మూలకారణం మలబద్ధకమే. శరీరంలోని ఇతర జీవక్రియల్లాగే జీర్ణక్రియ, విసర్జన క్రియలు కూడా సహజంగా సాగిపోవాల్సినవే. కానీ, కొన్నిసార్లు ఎక్కడో తేడా వస్తుంది. ఆ వెంటనే సహజ ధర్మాలన్నీ కుంటుబడతాయి. ఈ స్థితిలో ఎక్కువ మందిని వేధించే ఒక ప్రధాన సమస్య మలబద్ధకం. ఈ సమస్య దీర్ఘకాలికంగా ఉంటే శరీరం విషతుల్యం కావడం, ఆ తర్వాత నిరంతరం రోగగ్రస్థం కావడం ఖాయం.

ఎందుకొస్తుందీ సమస్య?

మలబద్ధకం రావడానికి గల కారణాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉండవచ్చు. అయితే మౌలికంగా, అత్య?ధికుల్లో అజీర్తి ఒక ప్రధాన కారణం. నిజానికి, అజీర్తి, మలబద్ధకం పరస్పరం విడదీయరాని సమస్యలు. సాధారణంగా ఒకటి లేకుండా మరొకటి ఉండదు. జీర్ణప్రక్రియకు జఠర రసమూ, జఠరాగ్ని ప్రధానమని మన ఆయుర్వేద, సిద్ధ, యునాని వైద్యాలు చెబుతాయి. ప్యాంక్రియాస్ ప్రధాన ప్రక్రియ ఇన్సులిన్ ఉత్పత్తి అని చాలామంది అనుకుంటారు. వాస్తవానికి మనం తినే ప్రధాన పోషక పదార్థాలు జీర్ణం కావడానికి కావలసిన ఎంజైములన్నీ ప్యాంక్రియాసే ఉత్పత్తి చేస్తుంది.

పిండి పదార్థాన్ని అమైలేస్, కొవ్వులను లిపేస్, వ ృక్ష సంబంధ పీచును సెల్యులేస్, మాంసక ృత్తులను ప్రొటియేస్, పంచదారను ఇన్సులిన్ అనే పాంక్రియాస్ ఎంజైములు జీర్ణం చేస్తాయి. మనం తిన్న ఆహార పదార్థాల నిష్పత్తులకు సరైన మోతాదుల్లో పైన వివరించిన ఎంజైములు జీర్ణప్రక్రియకు లభించనప్పుడు ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండానే చిన్న పేగులోంచి వెళ్తుంది. పెద్దపేగులో అది పులుస్తుంది. కుళ్లుతుంది. అపానవాయువు ఉత్పత్తి అవుతుంది. కడుపు ఉబ్బి, నొప్పి వస్తుంది. ఈ సమస్యకు కొందరు, భోజనం చేసిన ప్రతిసారీ పాంక్రియాటిక్ ఎంజైము కాప్సుల్స్ వాడుతూ ఉంటారు. వీటివల్ల కలిగేది తాత్కాలిక ఉపశమనమే. నిజానికి, మనం తీసుకునే ఆహారంలో ప్రధాన సూక్ష్మపోషక పదార్థాలు సరైన మోతాదులలోనూ, నిష్పత్తుల్లోనూ ఉండేలా చూసుకోవడమే దీనికి శాశ్వత పరిష్కారం.

చూర్ణాలతో ఎంత కాలం?

మలబద్ధకం సమస్యతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న వారిలో కొందరు త్రిఫల చూర్ణ, కాయచూర్ణ, ఇసబ్‌గోల్ లాంటి విరోచన కారక ఔషధాలు వాడుతూ ఉంటారు. వీటిని వారానికి రెండు మూడుసార్లయినా వేసుకోనిదే కొందరికి పొట్ట మామూలుగా ఉండదు.

మరికొందరికైతే రోజూ వేసుకుంటే తప్ప ఆ బాధ నుంచి బయటపడరు.

వీటిని వాడకతప్పని అత్యవసర పరిస్థితులు అప్పుడప్పుడు ఉంటే అదంత సమస్య కాకపోవచ్చు. కానీ వీటిని ప్రతిరోజూ వాడటం వల్ల అవి పేగుల సహజ ప్రక్రియలను కుంటుపరిచి, సమస్యను దీర్ఘకాలికమూ, జటిలమూ చేస్తాయి.

జీవనశైలిలో మార్పులు

శరీరానికి అవసరమైన మేర నీరు తాగడంతో పాటు, పీచు పదార్థమున్న ఆహార పదార్థాలకు ప్రాధాన్యమివ్వడం చాలా అవసరం. ఆకు కూరల్ని కాయ కూరల్ని అతిగా ఉడికించడం వల్ల వాటిని తీసుకున్న ప్రయోజనం కూడా ఉండదు. అవసరమైన ఆహార పానీయాలతో పాటు, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా తప్పనిసరి.

వైద్య చికిత్సలు

ఎంత దీర్ఘకాలికంగా వేధిస్తున్న మలబద్ధకాన్నయినా మూలికా వైద్యం శాశ్వతంగా నయం చేస్తుంది.

నిరంతరం విరేచనకారక ఔషధాలు వాడే అవసరం లేకుండా, మూడు నుంచి నాలుగు మాసాల కాలంలో నిశ్చితంగా, శాశ్వతంగా నయం అవుతుంది.

ఔషధ మిళిత యాపుల్ సిడార్ వెనిగర్ వాడితే, పొటాషియం లవణాలను, విటమిన్లను, ఎంజైములను, ఖనిజాలను, అమినో యాసిడ్లను అందిస్తుంది. ఆల్ఫాల్ఫా గింజల కషాయం అత్యంత బలవర్ధకం. అనేక జీర్ణవాహిక వ్యాధులు, కీళ్ల నొప్పులను ఇది ఒక్కటే నయం చేయగలదు. సాధారణ వైద్య చికిత్సలతో పాటు ఆయా వ్యక్తుల శరీర ధర్మాన్ని, అప్పటిదాకా వారు అనుసరిస్తూ వస్తున్న జీవనశైలిని పరిశీలించి తదనుగుణమైన చికిత్సలను మూలికా వైద్యం అందిస్తుంది.

# నిద్ర సమస్యకు అవే కారణమా..!



ఓ సినిమాలో విలన్ పోలీసులకు చిక్కుతాడు...అతడికి పోలీసాఫీసర్ వేసే శిక్ష ఏంటో తెలుసా? 'ఈ రోజు నుంచి తిండి, నీళ్లు ఇవ్వండి.. కానీ నిజం చెప్పే వరకూ నిద్రపోనీయకండి' అని సిబ్బందిని ఆదేశిస్తాడు.. ఒకవేళ నిద్రపోతే... లాఠీలతో కొట్టమని చెబుతాడు.. నిద్రలేకపోతే కలిగే ఇబ్బందితో నిజం చెబుతాడని అలా శిక్ష విధిస్తాడు. కానీ.. చాలా మంది ఎవరికి వారే శిక్ష విధించుకుంటున్నారు. నిద్రను బాగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా రకరకాల జబ్బుల బారిన పడుతున్నారు.

నగరంలోని ఐటీ ఉద్యోగులు నిద్రకు బాగా దూరం అవుతున్నట్టు తాజాగా ఓ కార్పొరేట్ ఆస్పత్రి చేసిన సర్వేలో వెల్లడైంది. కొద్ది నెలలుగా నగర ఐటీ ప్రొఫెషనల్స్‌పై డాక్టర్ నళిని నేత ృత్వంలోని బ ృందం 500 మంది ఐటీ ఉద్యోగుల నిద్రకు సంబంధించిన అంశంపై అధ్యయనం చేసింది. 25 - 45 ఏళ్ల మధ్య వయస్కులను ఇందుకోసం ఎంపిక చేసింది. ఈ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

సగం మందికి నిద్ర సమస్యే..

సర్వేలో పాల్గొన్న వారిలో 60శాతం మందికి నిద్ర సమస్యలతో బాధపడుతున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. అందులో 38 శాతం మంది గురకతో బాధపడుతున్నారు. పైగా సర్వేకు ఎంచుకున్నవారంతా పగలు మాత్రమే పనిజేసేవారు కావడం విశేషం. నెలకు కనీసం ఒక్కసారి కూడా వ్యాయమం చేయనివారి సంఖ్య 39 శాతంగా ఉంది. ఇక 96 శాతం మంది నిద్రపోయే ముందు కూడా సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, ల్యాప్‌టాప్‌లను వాడుతున్నారని తేలింది. నిద్రపోయే గంట ముందు వరకు కూడా49 శాతం మంది ఆఫీసుకు సంబంధించిన వర్క్‌ను చేస్తున్నట్టు వెల్లడించారు. మరి కొంతమంది నిద్ర మధ్యలో మెలుకువ వస్తే... వెంటనే సెల్‌ఫోన్‌లో మెయిల్స్ చెక్ చేసుకుంటున్నారట. నిద్రకు సంబంధించి 30 రకాల ప్రశ్నలను వారిపై వేసి సమాధానాలు రాబట్టారు. మొత్తంగా 50 శాతం ఉద్యోగుల నిద్రలేమి సమస్యలకు ప్రధాన కారణం పడుకునేముందు వరకు కూడా ఎలక్ట్రానిక్ వస్తువులతో గడపటమేనని తేలింది. అలాగే మోతాదుకు మించి కాఫీ,టీ, కూల్‌డ్రింక్స్ తాగడం, వ్యాయమం లేకపోవడం, జీవనశైలి విధానం కూడా నిద్ర సమస్యలకు కారణాలుగా తేలింది.

నిద్రపట్టకపోవడానికి అసలు కారణమిదే...

ప్రతి ఒక్కరూ నిద్రపోవాలంటే మెదడులోని మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి కావాల్సి ఉంటుంది. గాఢ నిద్రపట్టకపోవడానికి ప్రధాన కారణం హార్మోన్ తగినంత ఉత్పత్తి కాకపోవడమే. రాత్రిపూట ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ట్యాబ్స్, టీవీల నుంచి వచ్చే తెలుపు, బ్లూ, ఆకుపచ్చ కాంతి ఎక్కువసేపు చూడటం వల్ల కంటిపై ఒత్తిడి పెరిగి మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తి కాకుండా ఆగిపోతోంది. రోజుల తరబడి ఇటువంటి ఇలాంటి జీవన విధానాన్నే కొనసాగిస్తే నిద్రరావడం ఆగిపోతుంది.

నిద్రపోకపోతే ఏమవుతుందంటే...

శారరీక, మానసిక సమస్యలు తలెత్తుతాయి. ఉదయం లేవగానే తలనొప్పి మొదలవుతుంది. నిద్రపోయిన ఫీలింగ్ ఉండదు. పగలు కునుకు వేయాలనిపిస్తుంది. డ్రైవింగ్‌లోనూ నిద్ర వస్తుంది. నీరసంగా ఉంటూ... ఒకటే ఆవలింతలు వస్తాయి. పనిపై శ్రద్ధ ఉండదు. రాత్రిపూట గురకపెట్టడం, నిద్రమధ్యలోనే మేల్కోవడం, టాయిలెట్‌కు వెళ్లడం లాంటి సమస్యలను ఎదుర్కొంటారు. బీపీ, షుగర్, స్థూలకాయం, డిప్రెషన్‌లోకి వెళ్లడం, గుండె సంబంధిత జబ్బులు రావడం, మతిమరుపు, జుట్టు రాలడం, హార్మోన్స్ సమతుల్యత దెబ్బతినడం, జీర్ణవ్యవస్థ దెబ్బతినడం, లైంగిక జీవితంలో ఆసక్తి లేకపోవడంతో పాటు రకరకాల సమస్యలు వస్తాయి.

మంచి నిద్రకు మార్గాలివే..

పగలు కునుకు తీయవద్దు.

నిత్యం వ్యాయామం చేయాలి.

నిద్రపోయేముందు మితంగా భుజించాలి.

సహజసిద్ధమైన కాంతిలో నిద్రించాలి.

పడుకునేముందు పుసక్తపఠనం చేస్తే మంచిది.

పడుకునే గంటముందు ఎలక్ట్రానిక్ వస్తువులను వాడటం ఆపేయాలి.

కెఫిన్, నికోటిన్, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి.

రోజూ ఒక సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి.

వారి సంఖ్య బాగా పెరుగుతోంది

నిద్ర సమస్యతో బాధపడేవారి సంఖ్య బాగా పెరుగుతోంది. ప్రతీ వంద మందిలో 13 మంది ఇటువంటి సమస్యతో బాధపడుతుండగా ఐటీ ఉద్యోగుల్లో ఇది ప్రమాదకరరీతిలో ఉంది. నిద్రపట్టకపోవడానికి రెండు కారణాలుంటాయి. ఒకటి నిద్రలేమి, మరొకటి స్లీప్ అప్నియా. నిద్రలో కూడా శరీరంలో ప్రతి అవయవానికీ ఆక్సిజన్ అవసరం అవుతుంది. ఏళ్ల తరబడి అది అందకపోతే సహజంగానే అవి దెబ్బతింటాయి. గతంలో పగలంతా కాంతిలో, రాత్రి చీకటిలో ఉండేవాళ్లం. ఆ వ్యవస్థ నిద్రకు మంచిది. కానీ ఇప్పుడంతా రివర్స్. పగలంతా లైట్ల కాంతిలో, రాత్రి బ్రైట్ లైట్స్ కాంతిలో బతుకుతున్నాం.

ఇది నిద్రవ్యవస్థను దెబ్బ తీస్తోంది. నిద్రపోయే గంటముందు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్‌ను వాడటం ఆపేయాలి. అమెరికాలో చేసిన సర్వేలో కూడా 97 శాతం మంది నిద్రపోయే ముందు ఇలాగే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ వాడతారని తేలింది. నా సర్వేలో కూడా 96 శాతం మంది ఐటీ ప్రొఫెషనల్స్ వీటిని వాడుతున్నారు. అదే నిద్రపోవడానికి ప్రధాన సమస్య అని తేలింది.

# నొప్పికీ ఓ లెక్కుంది



ఎలాంటి నొప్పినైనా వైద్యులకు వివరించాల్సి వచ్చినప్పుడు ఎలా చెప్పాలో అర్థం కాక ఇబ్బంది పడతాం. కానీ నొప్పిని కచ్చితంగా గుర్తించటానికి వైద్యులు' పెయిన్ స్కేల్'ను వాడతారు. తీవ్రతను బట్టి నొప్పికి 1 - 10 అంకెలు కేటాయించారు. కాబట్టి ఈసారి ఎలాంటి నొప్పి గురించి వైద్యులను కలిసినా ఈ పెయిన్ స్కేల్ ప్రకారం నొప్పిని వివరించండి.

స్వల్పంగా (మైల్డ్): చాలా తక్కువ. మరీ అంత ఇబ్బంది పెట్టట్లేదు. రోజు మొత్తంలో దాని గురించి ఆలోచనే రాదు.

కొద్దిగా (మైల్డ్): నొప్పి ఉంది. చిరాకు పెడుతూ ఉన్నట్టుండి ఒక్కసారిగా తీవ్రమవుతూ ఉంటుంది.

అసౌకర్యం (అన్‌కంఫర్టబుల్): నొప్పి బాధిస్తూ ఉంటుంది. ఎప్పుడూ ఉంటుంది. దానికి అలవాటు పడి పనుల్లో పడిపోతూ ఉంటారు.

మోస్తరుగా (మోడరేట్): ఏదైనా పనిలో పడిపోయినప్పుడు నొప్పి తెలియదు. అయినా నొప్పి మాత్రం అదే పనిగా విసిగిస్తూనే ఉంటుంది.

దేని మీదా ఏకాగ్రత పెట్టలేనంత (డిస్‌ట్రాక్టింగ్): విపరీతమైన నొప్పి. కొద్ది నిమిషాలు కూడా వదిలిపెట్టదు. అయితే ప్రయత్నం మీద నొప్పి మీద నుంచి ధ్యాస మళ్లించి పనులు చేసుకోగలుగుతున్నారు.

వ్యధాభరితంగా (డిస్‌ట్రెసింగ్) : రోజువారీ జీవితాన్ని ఇబ్బంది పెట్టే నొప్పి. నొప్పి వల్ల ఏ పనీ చేయలేకపోతూ ఉండటం.

తీవ్రం (సివియర్): పంచేంద్రియాలను డామినేట్ చేసేటంత నొప్పి. నొప్పితో ఒక ప్రదేశానికే పరిమితమైపోవటం, ఎవరితో కలవలేకపోవటం, నిద్ర పట్టకపోవటం.

అత్యంత తీవ్రంగా(ఇంటెన్స్): శారీరాన్ని కదిలించలేకపోవటం. భరించరానంతగా నొప్పి. అతి కష్టం మీద మాట్లాడగలగటం.

భరించలేనంత(ఎక్స్‌క్రూషియేటింగ్): నొప్పి వల్ల మాటలు రాకపోవటం. బెడ్ మీది నుంచి అడుగు కూడా కదలలేకపోవడం. బిగ్గరగా ఏడ్వటం/ మూలగటం.

మాటల్లో చెప్పలేనంత (అన్‌స్పీకబుల్): మంచానికే పరిమితమై, ఏం జరుగుతుందో కూడా తెలియకపోవడం. ఎవరికీ చెప్పుకోలేని స్థితి. స్ప ృహ కోల్పోతూ ఉండటం.

నొప్పి గురించి చెప్పేటప్పుడు దొర్లే తప్పులు

సాధారణంగా వైద్యులకు నొప్పి గురించి వివరించేటప్పుడు ఉన్నదాని కంటే ఎక్కువ చేసి చెపుతూ ఉంటాం. అది రెండు పద్ధతుల్లో చేస్తూ ఉంటాం.

ఏ పెయిన్ స్కేల్‌తో పోలిస్తే నొప్పి 12 ఉందని చెప్పటం: నొప్పి తీవ్రతను వైద్యులకు వివరంగా చెప్పాలనే ఉద్దేశంతో ఇలా చెప్తూ ఉంటాం. కానీ ఇలా చెప్పటం వల్ల మీరు ఉన్నదాన్ని ఎక్కువ చేసి చెబుతున్నట్టు డాక్టర్లు గ్రహిస్తారు. దాంతో మీ నొప్పి తీవ్రతను కచ్చితంగా అంచనా వేయలేకపోతారు.

ఏ నొప్పి గురించి నవ్వుతూ చెప్పటం: నొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు మాట్లాడటమే కష్టం. అలాంటిది నవ్వుతూ మాట్లాడుతున్నామంటే నొప్పి భరించగలిగే స్థాయిలోనే, 10 లోపలే ఉందని అర్థం. ఎపిడ్యురల్ ఇంజెక్షన్ లాంటి నొప్పిని తగ్గించే ఇంజక్షన్ సహాయం లేకుండా జరిగే సాధారణ ప్రసవ నొప్పులే పెయిన్ స్కేల్‌లో 8 స్థానాన్ని సూచిస్తాయని గుర్తు పెట్టుకోండి. కాబట్టి వైద్యులకు అవసరాన్ని మించి నొప్పిని ఎక్కువ చేసి చెప్పటం వృథా ప్రయాసే అనే విషయాన్ని గ్రహించండి.

# రాత్రి నిద్ర కరువైతే..

కొందరేమో చిలుకల్లా పగలంతా పనిచేసి రాత్రంతా నిద్రిస్తారు. కొందరేమే గుడ్లగూబల్లా రాత్రంతా పనిచేసి పగలంతా నిద్రిస్తారు. అయితే "గుడ్లగూబ తరహా జీవన శైలిని అలవర్చుకున్న వారు ఎప్పుడో ఒకప్పుడు భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వస్తుంది", అంటున్నారు పరిశోధకులు. మీరు చిలుకలు అవుతారో, గుడ్లగూబలుగానే ఉండిపోతారో మీకు మీరే తేల్చుకోండి.

"త్వరగా నిద్రపోయి, త్వరగా మేల్కోవాలి" అనేది పాత కాలపు మాటలా అనిపించవచ్చు. రాత్రంతా పనిచేసి పగటిపూట నిద్రపోతే తప్పేంటి అనిపించవచ్చు. ఈ రోజుల్లో ఎక్కువ మంది ఈ పంథానే అనుసరిస్తూ ఉండవచ్చు కూడా. కానీ, ఎక్కువ మంది అనుసరించే మార్గమే అయినంత మాత్రాన అది ఉత్తమమైనదేమీ అయిపోదు కదా! ఎప్పుడో అరుదుగా, అనివార్యంగా అయితే సరే కానీ, రాత్రుళ్లు మేల్కొనడమే జీవన శైలి కాకూడదు. అదే జరిగితే, ఆ ఎదురయ్యే పరిణామలు అన్నీ ఇన్నీ కావు.... కొంతమంది తాత్కాలిక అవసరాల కొద్దీ అనివార్యంగానే ఈ వి?ధానాన్ని అనుసరించి ఉండవచ్చు. కానీ, ఆ తర్వాతర్వాత అదే ఒక అలవాటుగా మారిపోతుంది. రాత్రంతా మేల్కొనడంలో ఇబ్బంది కూడా ఏమీ అనిపించకపోవచ్చు. దానికి కారణం ప్రక ృతి విరుద్ధంగా తమ జీవగడియారాన్ని (బయోలాజికల్ క్లాక్) సర్దుబాటు చేసుకోవడమే. కానీ, డాక్టర్ల అభిప్రాయం ప్రకారం, మునుముందు నిద్రా సమస్యలు, యుక్తవయసులోనే గుండె జబ్బులు, డిప్రెషన్ వంటి రుగ్మతల పాలయ్యే అవ కాశాలు ఎక్కువగా ఉంటాయి.


జి సహజంగా నిద్రించాల్సిన సమయంలో మేల్కొని ఉంటే శరీరం వేడెక్కుతుంది. ఇది జీవ క్రియల అలసత్వానికి కారణమవుతుంది. వ్యాధినిరోధక శక్తి కుంటుపడేలా చేస్తుంది. మనలోని హార్మోన్ల, ఎంజైముల ఉత్పత్తికి తమదైన ఒక కాలమాన ప్రణాళిక ఉంటుంది. సహజంగా గ్లూకోజ్ ఎక్కువగా అవసరమయ్యే ఉదయం వేళల్లో కార్టిజాల్ హార్మోన్ పెద్ద మొత్తంలో ఉత్పన్నమవుతుంది. శ్రమ తగ్గిపోయే సాయంత్రానికి ఆ ఉత్పత్తి తగ్గిపోతుంది. అయితే ఈ బయోలాజికల్ క్లాక్‌ను తారుమారు చేసినప్పుడు ఈ హార్మోన్ వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది.



బయోలాజికల్ క్లాక్ వ్యవస్థ అనేది మనిషి మనిషికీ వేరుగా ఉండదు. వ్యక్తుల శారీరక వ్యత్యాసాల వల్ల ఏదైనా తేడా ఉన్నా అది స్వల్పమే. అందుకే ఎవరికి వారు నిద్రా, మెలకువల సమయాన్ని తమ ఇష్టానుసారంగా మార్చుకోవడం కుదరదు. రాత్రంతా మేలుకునే వాళ్లు కొందరు " ఈ టైమింగ్స్ వల్ల మాకు అసౌకర్యంగా గానీ, అస్వస్థతగా గానీ ఏమీ ఉండడం లేదు. పైగా ఉత్సాహంగా, హుషారుగానే ఉంటున్నాం. ఇక ఇబ్బంది ఏముంది?" అంటూ ఉంటారు. అయితే, పైకి అంతా సవ్యంగానే ఉన్నట్లు అనిపించినా, లోలోపల జరిగే నష్టం జరుగుతూనే ఉంటుంది.

మౌలికంగా సూర్యగమనానికీ, ఆకలికీ అవినాభావ సంబంధం ఉంది. ఉదయాస్తమయాల మధ్య సరిగ్గా పనిచేస్తూ ఉంటుంది. ఆలోచనలకూ, కార్యాచరణకూ మూలాధారంగా మనలో ఒక ప్రాణశక్తి ఉంటుంది. అది జీవితాంతం మన తోడై ఉంటుంది. అయితే రాత్రిళ్లు ఎక్కువగా మేల్కొనే వాళ్లల్లో ఈ ప్రాణశక్తి అత్యధికంగా ఖర్చు అవుతుంది. దీనివల్ల యుక్త వయసులోనే శరీరం రోగగ్రస్తం కావడం, అకాల వ ృద్ధాప్యం రావడం సంభవిస్తాయి. రాత్రివేళల్లో జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైములు కూడా స్వల్పంగానే ఉత్పన్నమవుతాయి. ఈ కారణంగా మధ్యరాత్రి చేసే భోజనం సరిగ్గా జీర్ణం కాదు. శరీరమంతా నిద్రావస్థలో ఉండడం కూడా ఇందుకు కారణమే. కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి జీర్ణాశయ సమస్యలే కాదు స్థూలకాయం రావడానికి కూడా ఈ కారణాలే ప్రధానంగా ఉంటాయి. అందుకే.....,నా శరీరం, నా ఇష్టం అనే ధోరణితో కాకుండా, ప్రక ృతి సహజ నియమాలను ఎవరైనా విధిగా పాటించడమే శ్రేయస్కరం.

## సెకండ్ ఒపీనియన్ మేలే!



వ్యాధి నిర్ధారణ విషయంలో గానీ, సర్జరీ అవసరం అన్నప్పుడు గానీ, ఒక్కోసారి సందిగ్ధం ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో మరో డాక్టర్ అభిప్రాయం కోసం వెళ్లడం కొన్ని సార్లు అవసరమవుతుంది. ఈ స్థితి ఒక్కోసారి పేషంట్ కారణంగానూ ఏర్పడవచ్చు. మరికొన్నిసార్లు డాక్టర్ కారణంగానూ ఏర్పడవచ్చు. ఎందుకంటే పేషంట్ ఒక్కోసారి తనకున్న సమస్యల గురించిన పూర్తి వివరాలు ఆ డాక్టర్‌కు చెప్పలేకపోయి ఉండవచ్చు. లేదా అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పడం మరిచిపోయి అంత ప్రాధాన్యత లేని విషయాన్నే చెప్పి ఆగిపోవచ్చు ఇలాంటి సమయాల్లో మరో డాక్టర్‌ను కలిసినప్పుడైనా అంతకు ముందు చెప్పలేని విషయాలు చెప్పే అవకాశం ఉంటుంది.సర్జరీ విషయంలో అయితే, సర్జరీ నిజంగానే అవసరమా? వ్యాధి, మందులతోనే తగ్గిపోయే అవకాశం ఉందా? ఇలాంటి సమాచారం మరో డాక్టర్‌ను సంప్రదించినప్పుడు లభించే అవకాశం ఉంది. కొన్ని సర్జరీల విషయంలో డాక్టర్లకు భిన్నాప్రాయాలు ఉండవచ్చు. ఏవో కొద్దిపాటి తేడాలే తప్ప ప్రధాన అంశంలో ఏకాభిప్రాయమే ఉంటే, అప్పుడు ఒక నిర్ణయానికి రావచ్చు. ఒకవేళ ఇద్దరి అభిప్రాయాలూ పూర్తి విరుద్ధంగా ఉంటే అప్పుడు మూడో అభిప్రాయానికి కూడా వెళ్లవలసి రావచ్చు. కాకపోతే అలాంటి సందర్భం చాలా అరుదుగానే వస్తుంది.ఒక డాక్టర్‌ను కలిశాక మరో డాక్టర్ అభిప్రాయానికి వెళ్లడం వల్ల మొదటి డాక్టర్ మనస్తాపానికి గురికావడం అనేది ఈ రోజుల్లో లేదు. మరో డాక్టర్ కూడా అదే అభిప్రాయానికి వస్తే, పేషంట్‌కు తన మీద మరింత నమ్మకం ఏర్పడుతుందని డాక్టర్ భావిస్తారు అందుకే, ఒక్కోసారి డాక్టర్లే స్వయంగా మీరు మరో డాక్టర్ అభిప్రాయం కూడా తీసుకోవచ్చని చెబుతుంటారు. ఇది ఇటు పేషంట్‌కూ, అటు డాక్టర్‌కూ

# ఇలా మానేయవచ్చు..!

సరదాగా మొదలుపెట్టిన ధూమపానం... తరువాత వ్యసనంగా మారిపోతుంది. వద్దు వద్దనుకున్నా ఓ దమ్ము కొట్టనిదే ఏ పనీ చేయలేని పరిస్థితికి లాగేస్తుంది. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు పొగ తాగడం మానేద్దామని చాలామందే అనుకుంటారు. కానీ... అందులో నుంచి బయటకు రాలేక సతమతమవుతుంటారు. అలా ప్రయత్నించేవారి కోసమే ఈ చిట్కాలు...

బీ పాజిటివ్: మీకో విషయం తెలుసా... పొగ తాగడం ఆపేస్తే కేన్సర్ అవకాశాలను సగం తగ్గించినట్టే! ధూమపానం ఆపేద్దామనుకున్నప్పుడు ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అలా జరగాలంటే సిగరెట్ వంటివి మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ముందుగా తెలుసుకోవాలి. 'దమ్ము వేయకుండా ఉండటం నా వల్ల కావట్లేదు' అనుకోకుండా 'నేనెందుకు మానేయలేను' అని ఆశావహ ద ృక్పథంతో ఆలోచించండి.

వేరే వ్యాపకం: తరచూ పొగాకు ఉత్పత్తుల వినియోగం మనల్ని వాటికి బానిసల్ని చేసేస్తుంది. దాన్ని వదిలించుకోవాలంటే... మనసు అటువైపు లాగేస్తున్నప్పుడు వేరే వ్యాపకం పెట్టుకోవాలి. ఒకవేళ ఫోన్‌లో మాట్లాడుతూ పొగ తాగుతుంటే... మీ వద్ద ఓ పెన్ను, పేపర్ పెట్టుకోండి. తద్వారా అటెన్షన్‌ను డైవర్ట్ చేయవచ్చు.

ఒకే ఒక్కటి: 'ఒకే ఒక్క సిగరెట్' తాగేసి ఆపేద్దామని ఎప్పుడూ అనుకోవద్దు. అలా అనుకుంటే మన కంటే పెద్ద తెలివితక్కువ వారు ఎవరూ ఉండరు. ఒక్కటితో ఆపడం అసాధ్యం. ఆ తరువాత మరొకటి తాగాలనిపిస్తుంది. చివరకు ఇది మళ్లీ వ్యసనానికి దారి తీస్తుంది.

ఫిట్‌నెస్ మంత్ర: ఏదైనా శారీరక శ్రమ ఉండే పనేదైనా చేస్తే నికోటిన్‌పైకి పెద్దగా మనసు వెళ్లదు. సో... రోజూ వ్యాయామం అలవాటు చేసుకోండి. వీలైతే నలుగురితో కలిసి చేస్తే... వేరే విషయంపైకి ధ్యాస మళ్లదు.

రిలాక్సేషన్ టెక్నిక్స్: సాధారణంగా సిగరెట్ అలవాటు ఉన్నవారు ఒత్తిడిలో ఎక్కువ తాగుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని అధిగమించడానికి దీర్ఘ శ్వాస వ్యాయామం, యోగా, ధ్యానం, మసాజ్ వంటి రిలాక్సేషన్ టెక్నిక్స్‌ను సాధన చేయడం ద్వారా పునరుత్తేజాన్ని పొందవచ్చు.

కంగారు వద్దు: ఒక్కసారిగా ధూమపానం మానేయడం వల్ల తల, కడుపు, గొంతు నొప్పి, ఒత్తిడి, నిస్సత్తువ, నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాటికి కంగారు పడాల్సిన పనిలేదు. ఓర్పుతో ఉంటే నిదానంగా అవే తగ్గిపోతాయి.

వారం తరువాత: పొగ తాగడం ఆపేసిన వారం తరువాత ఉత్సాహంగా ఉండటానికి ప్రయత్నించండి. వాకింగ్‌కు వెళ్లండి. సంగీతం వినండి. స్నేహితులతో గడపండి. మిమ్మల్ని మీరు తీరిక లేకుండా ఉంచుకోండి. సిగరెట్‌పైకి మనసు లాగేసినప్పుడల్లా మింట్, క్యాండీ వంటివి చప్పరించండి. సాధ్యమైనన్ని నీళ్లు తాగండి. ఓ గ్లాస్ చల్లటి నీరు మీ శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది. ధూమపానం కోసం ఆరాటాన్ని తగ్గిస్తుంది.



## సక్సెస్ ట్రాక్ ఎక్కిన యూత్ స్టార్..

# జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్నాడుగా..!



టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ గత ఏడాది ప్రారంభంలో 'భీష్మ' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఈ సక్సెస్ ఇచ్చిన జోష్ లో నాలుగు సినిమాలు లైన్ లో పెట్టిన నితిన్.. జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం నితిన్ 'రంగ్ దే' అనే రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ లో నటిస్తున్నాడు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నాడు. మార్చి 26న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. అలానే భవ్య క్రియేషన్స్ బ్యానర్ లో చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో 'చెక్' అనే సినిమా చేస్తున్నాడు నితిన్. ఓ సాంగ్ మినహా ఈ సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిందని సమాచారం. ఇకపోతే 'అంధాదున్' తెలుగు రీమేక్ ని ఈ మధ్యే స్టార్ట్ చేసాడు నితిన్. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హోమ్ ప్రొడక్షన్ శ్రేష్ఠ మూవీస్ బ్యానర్ పై సుధాకర్ రెడ్డి – నికిత రెడ్డిలు నిర్మించనున్నారు. 'భీష్మ' తరువాత స్పీడ్ పెంచిన నితిన్.. ఎలాగైనా 50 కోట్ల షేర్ ని రీచ్ అవ్వడానికి గట్టిగా ట్రై చేస్తున్నాడని తెలుస్తోంది. ఈ సినిమాలు పూర్తైన తర్వాతే నితిన్ ఫుల్ ఫోకస్ 'పవర్ పేట' సినిమా మీద పెట్టబోతున్నాడని సమాచారం. ఈ చిత్రానికి నితిన్‌తో ఇంతకముందు 'చల్ మోహన్ రంగా' సినిమా తీసిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహించనున్నారు. ఏదేమైనా సక్సెస్ ట్రాక్ ఎక్కిన నితిన్ వరుసగా నాలుగు సినిమాలు లైన్ లో పెట్టి కెరీర్ ని పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నాడని చెప్పవచ్చు.

# నేను ఫెయిలయ్యాను.. మెగా హీరో ఆనందం!



మెగా హీరో వరుణ్తేజ్ కరోనా నుంచి బయటపడ్డారు. కొన్నిరోజుల క్రితం ఆయనతోపాటు ఆయన సోదరుడు హీరో రామ్చరణ్ కూడా కరోనా బారిన పడ్డ విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇద్దరూ వేర్వేరుగా హోం క్వారెంటైన్‌లో ఉన్నారు. అయితే.. వారం రోజుల అనంతరం నిర్వహించిన పరీక్షలో తనకు నెగటివ్ రిపోర్ట్ వచ్చిందని వెల్లడించాడు వరుణ్. కరోనా ఫలితంతో సంతోషంలో మునిగితేలుతున్నాడు వరుణ్. తన ఆనందాన్ని ట్విటర్ వేదికగా వ్యక్తం చేశాడు. తనకు కరోనా పరీక్షల్లో నెగెటివ్ వచ్చిందని ప్రకటించని వరుణ్.. 'నెగటివ్ అనే రిపోర్టు ఇంత ఆనందాన్ని ఇస్తుందని ఎప్పుడూ అనుకోలేదు' అంటూ ట్వీట్ చేశాడు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపాడు. కాగా.. వరుణ్ కరోనా నుంచి బయటపడడంతో అందరి చూపు రామ్ చరణ్ పై పడింది. వాస్తవానికి వరుణ్ కన్నా ముందుగానే చరణ్ కరోనాకు గురయ్యారు. అయితే.. ఇప్పుడు వరుణ్ నెగటివ్ అంటూ రిపోర్టు వచ్చింది కానీ.. చెర్రీ సమాచారం మాత్రం తెలియరాలేదు. దీంతో.. రామ్ చరణ్ ఇంకా క్వారైంటైన్ లోనే ఉన్నాడని అనుకుంటున్నారు అందరూ. వరుణ్ విషయంతో హ్యాపీగా ఉన్న మెగా అభిమానులు.. రామ్ చరణ్ గురించి తెలియకపోవడంతో కలవరానికి గురవుతున్నారు. రామ్చరణ్ త్వరగా కోలుకోవాలంటూ ట్వీట్లు చేస్తున్నారు. గత నెలలో మెగా ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం తానుకరోనా పాజిటివ్ అని చరణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# నిహారిక.. ఈసారి ఈచోట మమేకమైన క్షణం



మెగా ప్రిన్సెస్ నిహారిక కొణిదెల గుంటూరు ఐజీ వారసుడు టెకీ చైతన్య జొన్నలగడ్డను వివాహమాడిన సంగతి తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్ పూర్ లో ఈ పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. పెళ్లి సందడికి సంబంధించిన వీడియోలు.. ఫోటోలు అంతర్జాలంలో జోరుగా వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నిహారిక – చైతన్య జోడీ మాల్దీవుల్లో హనీమూన్ ట్రిప్ ని ఎంజాయ్ చేసారు. ఈ విహార యాత్రకు సంబంధించి ఇప్పటికే బోలెడన్ని ఫోటోల్ని నిహారిక స్వయంగా ఇన్ స్టాలో షేర్ చేయగా అవి వైరల్ అయ్యాయి. తాజాగా ఈ భామ మరో స్పెషల్ ఫోటోని షేర్ చేసింది. నేవీ బ్లూ డెనిమ్ టాప్ లో నిహారిక సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. బటన్ డిజైన్డ్ డెనిమ్ టాప్ తనకు పర్ఫెక్ట్ యాప్ట్ అవ్వడమే గాక తన అందాన్ని హాట్ నెస్ ని ఎలివేట్ చేసింది. ఈ లుక్ కెవ్వు కేక! అంటూ ఫ్యాన్స్ లోనూ హాట్ టాపిక్ గా మారింది. ఈసారి ఈ చోట..! అంటూ చక్కని క్యాప్షన్ తో ఈ ఫోటోని సోషల్ మీడియాల్లో రివీల్ చేసింది నిహారిక. హబ్బీతో ప్రతి ఆనంద క్షణాల్ని ఆస్వాధిస్తూ నిహారిక సంతోషంగా కనిపిస్తోంది. ఇక నెక్ట్స్ ఏంటి? అంటే.. తిరిగి నిహారిక నటిగా కెరీర్ ని సాగిస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంటుంది.

# షార్ట్ ఫిలింలో రెచ్చిపోయి నటించిన అనుపమ..!



మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ 'ప్రేమమ్' సినిమాతో తెరంగ్రేటం చేసి నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక 'అ ఆ' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన అనుపమ.. 'ప్రేమమ్' 'శతమానం భవతి' 'ఉన్నది ఒకటే జిందగీ' 'కృష్ణార్జున యుద్ధం' 'హలో గురూ ప్రేమ కోసమే' 'రాక్షసుడు' వంటి సినిమాలలో నటించింది. ప్రస్తుతం నిఖిల్ తో కలిసి '18 పేజెస్' సినిమాలో నటిస్తోంది. తన అందంతో యువ హృదయాల్ని కొల్లగొట్టిన అనుపమ.. లేటెస్టుగా 'ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్' అనే షార్ట్ ఫిల్మ్ లో నటించింది. ఫస్ట్ లుక్ తోనే ఆకట్టుకున్న ఈ మలయాళ లఘు చిత్రానికి సంబంధించిన టీజర్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. 'ఫ్రీడమ్ ఎట్ మిడ్ నైట్' షార్ట్ ఫిల్మ్ టీజర్ చూస్తుంటే ఇది భార్యాభర్తల మధ్య జరిగే స్టోరీ అని తెలుస్తోంది. ఇందులో అనుపమ పరమేశ్వరన్ – హక్కిం షాజహాన్ జంటగా నటించారు. నీకోసం ఏమైనా చేస్తానని హక్కిం అంటుండగా.. నాకోసం ఎవరినైనా చంపుతావా? అని అనుపమ అడుగుతుంది. ఇద్దరి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. సాంప్రదాయబద్ధంగా చీరకట్టులో ఉన్న అనుపమ లుక్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ షార్ట్ ఫిల్మ్ కోసం అను రెచ్చిపోయి నటించిందని అర్థం అవుతోంది. ఆర్ జే షాన్ ఈ లఘు చిత్రానికి దర్శకత్వం వహించగా.. అఖిల్ మిధున్ నిర్మించారు. త్వరలో విడుదల కానున్న ఈ మలయాళ షార్ట్ ఫిల్మ్‌ని తెలుగు కన్నడ భాషల్లో కూడా రిలీజ్ చేయనున్నారు. ఇన్నాళ్లూ సిని మాలతో అలరించిన మలయాళ బ్యూటీ అనుపమ.. ఇప్పుడు షార్ట్ ఫిలింతో ఏ మేరకు అలరిస్తుందో చూడాలి.

# కాస్టింగ్ కౌచ్.. నాకు ఇలా జరిగింది : హీరోయిన్



గతంలో కాస్టింగ్ కౌచ్ లేపిన దుమ్మారం అంతా ఇంతా కాదు. సినీ ఇండస్ట్రీలో వేళ్లూనుకున్న ఈ పద్ధతి వల్ల తమను తాము కోల్పోయామని పలువురు నటీమణులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ క్రమంలో ఒక ఉద్యమం కూడా సాగింది. ఆ తర్వాత చల్లారినప్పటికీ.. అప్పుడప్పుడూ ఈ విషయం తెరపైకి వస్తూనే ఉంది. తాజాగా.. హీరోయిన్ మాళవిక శర్మ ఈ విషయంపై స్పందించింది. రవితేజ సరసన నటించి 'నేల టిక్కెట్టు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది బ్యూటిఫుల్ హీరోయిన్ మాళవిక శర్మ. తన అందంతో మెస్మరైజ్ చేసే ఈ అమ్మడు.. సంక్రాంతికి రామ్తో కలిసి థియేటర్స్‌లో సందడి చేయబోతోంది. వీరు జంటగా నటించిన 'రెడ్' మూవీ జనవరి 14న విడుదలకు సిద్ధమైంది. చిత్ర ప్రమోషన్స్లో భాగంగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న మాళవిక.. సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ పై నోరు విప్పింది. ఇప్పటికే పలువురు హీరోయిన్లు కాస్టింగ్ కౌచ్ కారణంగా మోసపోయామని ఓపెన్ అవుతుండగా.. మరికొందరు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. ఈ అంశంపై మీ స్పందన ఏంటని మాళవిక శర్మను ప్రశ్నించగా.. 'నాకైతే అలాంటి పరిస్థితి ఎదురు కాలేదు' అని చెప్పింది. మరి ఇతరులకు ఎదురైందా? అని అడగ్గా.. అది తనకు తెలియదని చెప్పింది మాళవిక. కాగా.. మాళవిక–రామ్ నటించిన 'రెడ్' సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహించారు. ఈ మూవీలో హీరో రామ్తో పాటు హీరోయిన్ మాళవికను డిఫరెంట్గా ప్రెజెంట్ చేశారని టాక్. ఈ మూవీలో రామ్ సరసన ముగ్గురు హీరోయిన్లు నటించారు. నివేదా పేతురాజ్ మాళవికా శర్మ అమృతా అయ్యర్ ఈ మూవీలో సందడి చేయనున్నారు. స్రవంతి రవికిశోర్ నిర్మించిన ఈ చిత్రానికి.. మణిశర్మ సంగీతం అందించారు. వాస్తవానికి ఈ మూవీ షూటింగ్ ఎప్పుడో ముగిసింది. కానీ.. థియేటర్లలోనే విడుదల చేయాలని ఇన్నాళ్లూ ఎదురు చూశారు దర్శకనిర్మాతలు.

# లోతులకు భయపడకపోతే నాతో రండి అంటోంది!



లోతులకు భయపడకపోతే నాతో రండి అంటోంది! అంటోంది సోనాల్ చౌహాన్.. ఈ అమ్మడి పరిచయం అవసరం లేదు. హ్యాపీడేస్ రాహుల్ సరసన తొలిసారి సోలో నాయికగా నటించిన సోనాల్ కి ఆ తర్వాత నటసింహా నందమూరి బాలకృష్ణ సరసన నటించాక గుర్తింపు దక్కింది. బాలయ్య సరసన లెజెండ్– డిక్టేటర్ – రూలర్ సినిమాల్లో నటించింది. లెజెండ్ సినిమా సూపర్ హిట్ అయినా ఎందుకనో లక్ కలిసిరాలేదు. ఆ క్రమంలోనే సోనాల్ ముంబై పరిశ్రమలో బిజీ అవ్వాలని ప్రయత్నించింది. కానీ అక్కడా అవకాశాల్లేవ్. ఇక సోనాల్ చౌహాన్ తన సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తన వ్యక్తిగత జీవితంలో ఏం జరిగినా తన అభిమానులకు నిరంతరం అప్ డేట్ చేయడానికి వెనకాడదు. మొన్న క్రిస్మస్ వేడుకలు సహా నూతన సంవత్సర వేడుకలను ఈ అమ్మడు సంబరంగా జరుపుకుంది. అందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. ప్రస్తుతం సోనాల్ గోవా పర్యటనలో ఉంది. అక్కడి నుండి వరుసగా వేడెక్కించే ఫోటోలను షేర్ చేస్తూ కుర్రకారులో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే చాలా ఫోటోల్ని పోస్ట్ చేయగా అవి వైరల్ అయ్యాయి. ఇంతకుముందు పూల్ సైడ్ ట్రీట్ కి సంబంధించిన ఫోటోల్ని షేర్ చేసింది. తాజాగా బికినీ బీచ్ లో ఇసుక తిన్నెల్లో చిద్విలాసంగా నవ్వులు చిందిస్తున్న ఓ హాట్ ఫోటోని సోనాల్ షేర్ చేసింది. ఇందులో పింక్ రెడ్ టాప్.. వైట్ బాటమ్ వేర్‌తో సోనాల్ మైమరిపించింది. టూపీస్‌లో సోనమ్ అందాలు యూత్ ని పిచ్చిగా కవ్వించేస్తున్నాయి మరి. ఇంతగా ట్రీటిస్తున్న ఈ అమ్మడిని పిలిచి మన దర్శకనిర్మాతలు మళ్లీ అవకాశాలిస్తారేమో చూడాలి. బోయపాటి.. శ్రీవాస్ .. పూరి వీళ్లలో ఎవరైనా పిలిచి మరీ ఛాన్సులిచ్చేస్తారేమో?

# సోనూసూద్ పై పోలీసులకు ఫిర్యాదు.. కారణం ఇదే!



కరోనా లాక్ డౌన్లో ఏ దిక్కూమొక్కూ లేక అవస్థలు పడ్డ ఎంతో మంది కార్మికులను అభాగ్యులను వారి సొంత ప్రాంతాలకు చేర్చి ఆపద్భాందవుడు అయ్యాడు బాలీవుడ్ నటుడు 'సోనూ సూద్'. సాయం కోసం అర్థించిన ప్రతీ చేతిని ఆప్యాయంగా అందుకుని నేనున్నానంటూ అండగా నిలిచాడు. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశాడు సోనూ సూద్. అయితే.. అలాంటి వ్యక్తిపై తాజాగా.. పోలీసులకు ఫిర్యాదు అందింది. ముంబైలోని ఓ ఆరు అంతస్తుల భవనాన్ని మునిసిపాలిటీ పర్మిషన్ తీసుకోకుండా హోటల్ గా మార్చారన్నది సోనూపై నమోదైన అభియోగం. బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ అనుమతి లేకుండా భవనాన్ని హోటల్ గా మార్చారని ఫిర్యాదులో పేర్కొంది బీఎంసీ. అయితే.. దీనిపై స్పందించాడు సోనూ సూద్. తాను భవనాన్ని హోటల్ గా మార్చడానికి బీఎంసీ పర్మిషన్ తీసుకున్నానని చెప్పాడు. అందుకు సంబంధించిన పత్రాలు తన వద్ద ఉన్నాయని తెలిపాడు. అయితే.. కేవలం మహారాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ పర్మిషన్ రావాల్సి ఉందన్నాడు. దీనికి కూడా దరఖాస్తు చేసుకున్నానని కరోనా కారణంగానే ఈ అనుమతి ఇంకా రాలేదని చెప్పాడు సోనూ. ఒకవేళ అనుమతి రాకుంటే తన హోటల్ ను తొలగిస్తానని చెప్పాడు. కాగా.. ప్రస్తుతం చిరంజీవి హీరోగా నటిస్తున్న 'ఆచార్య' సినిమాలో నటిస్తున్నాడు సోనూ. తాజాగా.. తమ పిల్లల ఆన్లైన్ తరగతుల కోసం ఇబ్బందులు పడుతున్న వంద మంది సినీ కార్మికులకు 100 స్మార్ట్ ఫోన్లు పంచిపెట్టిన విషయం తెలిసిందే.

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989